బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం. 17 సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

## సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్



వివరాలు 2లో..

## బీజేపీతో పొత్తుండదు..



- దామాషా ప్రకారం సీట్లు పెంచితేనే డీలిమిటేషన్‌కు బీఆర్ఎస్ మద్దతు
- ఏఐని సానుకూలంగా స్వీకరించాలి
- 'సైరూట్ ఏరోస్పేస్'.. తెలంగాణ ఇన్నోవేషన్ విజయానికి నిదర్శనం
- 'స్టార్టప్ స్టేట్ తెలంగాణ'పై ఓపీ జిందాల్ గ్లోబల్ వర్సిటీలో కేటీఆర్ కీలకోపన్యాసం

**హైదరాబాద్,సెప్టెంబర్-17:** రాబోయే 2028 తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో బీజేపీతో ఎలాంటి పొత్తు పెట్టుకో బోమని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. హర్యానాలోని సోనిపట్‌లో ప్రఖ్యాత ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో బుధవారం 'ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్: ది స్టోరీ ఆఫ్ ఏ స్టార్టప్ స్టేట్' అనే అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ.. 'బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదు' అని స్పష్టమైన ప్రకటన చేశారు. డీలిమిటేషన్‌పై అడిగిన మరో ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ప్రాతినిధ్యం ఉందని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను దామాషా ప్రకారం పెంచితేనే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి అన్యాయం జరుగదని పేర్కొన్నారు. ఆ దామాషా ప్రకారం సీట్ల పెంపు జరిగితే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడానికి బీఆర్ఎస్‌కు ఎలాంటి అభ్యంతరం ఉండదని తెలిపారు. అంతకుముందు తెలంగాణ ఆవిర్భావం నుంచి సాధించిన ప్రగతి, పాలనా సంసరణలు, వినూత్న ఆలోచనల అమలుపై ఆయన విస్తృతతంగా వివరించారు.కృత్రిమ మేధస్సు (ఎఐ), సాంకేతిక మార్పులపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ ఆసక్తికర సమాధానాలు ఇచ్చారు. గతంలో కంప్యూటర్లు, ఇంటర్నెట్ వచ్చినప్పుడు కూడా వ్యతిరేకత వచ్చిందని, ఇప్పుడు ఏఐ విషయంలోనూ అదే జరుగుతున్నదని అన్నారు. సాంకేతిక మార్పులను అడ్డుకోలేమని, ఏఐని సానుకూలంగా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఒక స్టార్టప్ స్టేట్‌గా అభివర్ణించిన కేటీఆర్, అభివృద్ధి ప్రస్థానాన్ని 'నిర్దిష్టత (సర్టెనిటి), అవకాశాలు (పాజిబులిటీ)' అనే రెండు సిద్ధాంతాల ద్వారా వివరించారు.

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

- యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం
- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించాం
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తాం
- పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు విముక్తి
- ధరణి పేరిట గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది
- రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది
- బీఆర్ఎస్ భూములను ఇష్టారాజ్యంగా బదిలీ
- కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ చేస్తాం
- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతాం
- ఫాంహౌస్ భూములపై 30 రోజుల్లో నివేదిక
- శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన



**బలగం టీవీ, హైదరాబాద్ :** 22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. మిగతా 3లో..

## ధరణి, భూభారతిపై.. విచారణకు సిద్ధమా?



- మిమ్మల్ని నిలదీస్తామనే కుట్రపూరితంగా సస్పెన్షన్
- 22ఏ నిషేధిత జాబితా పేరిట అవినీతి అక్షరసత్యం
- శాసనసభ వేదికగా సీఎం రేవంతే అంగీకరించిండు
- నాదర్‌గుల్‌లో 373 ఎకరాల భూ కుంభకోణం, రూ.10 వేల కోట్ల భూ స్కామ్‌పై మాట్లాడవేం?
- ఫ్యూచర్ సిటీ చుట్టూ ఎన్ని వందల ఎకరాలున్నయో
- ధరణి, భూభారతి, మీ ఆస్తులు, మా ఆస్తులపై సర్కార్‌లో భూ అవకతవకలపై ఎంక్వైరీకి రెడీనా?
- బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ సవాల్

వివరాలు 3లో..

## ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ ఆయుధ ప్యాకేజీ



- రూ.26వేల కోట్ల విలువైన ఆయుధాలు సరఫరా!
- 40వేల అత్యంత శక్తిమంతమైన భారీ బాంబులు
- ఇజ్రాయెల్‌తో అమెరికా రహస్య సమావేశం!
- ఏడు అరబ్ దేశాల సైనికాధికారులతో భేటీ

వివరాలు 2లో..

# సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

- దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్-17:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందని అన్నారు. పన్ను నిబంధనలలో మార్పుల కోసం వ్యక్తిగత ప్రయోజనాల ఆధారంగా కాకుండా వ్యవస్థకు ఉపయోగపడే రీతిలో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. బెంగళూరులో ఇంటర్నేషనల్ ట్యాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేషన్ 8వ అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని నిబంధనల వల్ల కొందరు పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. అయినప్పటికీ.. ఈ నిబంధనలు పన్ను వ్యవస్థ సమర్థతను మిగతా 3లో..

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే



- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ

వివరాలు 3లో..

## అర్హులైన లబ్ధిదారులకు స్వయం ఉపాధి

- నవంబరు 19న రాజీవ్ యువ వికాసం ప్రారంభం
- తొలి విడతగా రూ.1 లక్ష ఆర్థికసాయం అందజేత
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులతో భట్టి సమీక్షా



**బలగం టీవీ, హైదరాబాద్ :** తెలంగాణలో రాజీవ్ యువ వికాసం పథకంపై రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం తొలి విడతగా రూ.1 లక్ష వరకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నవంబరు 19 నుంచి రాజీవ్ యువ వికాసం స్కీమ్ ప్రారంభించేలా అవసరమైన అన్ని చర్యలు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి నిర్వహించిన ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, గురుకులాల పనితీరు, స్కాలర్‌షిప్‌లు, మౌలిక వసతులు, స్టడీ సర్కిళ్ల నిర్వహణపై సమగ్రంగా చర్చించారు.

## ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట



- ఈ ఏడాది అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం
- ఆయిల్‌పామ్‌కు ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు
- ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర
- ఉద్యాన రంగ అభివృద్ధికి రూ.1,000 కోట్లతో కార్యాచరణ
- మంత్రి తుమ్మల మిగతా 3లో..

# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పే
- హరీశ్‌రావు మామ భూములకు ఎలా జరిగింది?
- అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది హరీష్?
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్



**బలగం టీవీ, హైదరాబాద్ :** మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ మిగతా 3లో..

## శ్రీవారి భక్తులకు స్కైవాక్ బ్రిడ్జి

- మరింత మెరుగైన సేవలు అందిస్తాం
- తిరుమలను అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం
- తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్
- ఎస్వీ మ్యూజియం ను ఆధునీకరించాం
- టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో ఆధునీకరణ
- ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన
- టీటీడీ కార్యక్రమాలను ప్రారంభించిన సిఎం
- టీటీడీ పైన సిఎం ఉన్నత స్థాయి సమీక్ష 2లో..



# మెటాను ఇక సాధారణ మధ్యవర్తి కాదు

- మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందే
- మెటాపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన!



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 :** ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేరెంట్ కంపెనీ మెటాకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా వేదికలపై వినియోగదారులకు ఏ కంటెంట్ లేదా సమాచారం ఎక్కువగా కనిపించాలో/చేరాలో నిర్ణయించడానికి అల్గారిథమ్స్ ఉపయోగిస్తున్నప్పుడు, మెటాను కేవలం సమాచారం చేరవేసే సాధారణ మధ్యవర్తిగా (ఇంటర్మీడియరీ) చూడలేమని ప్రభుత్వ వర్గాలు బుధవారం స్పష్టం చేశాయి. అదొక సర్వీస్ ప్రొవైడర్ కిందికి వస్తుందని, అలానే పరిగణించాలని పేర్కొన్నాయి. మిగతా సర్వీస్ ప్రొవైడర్ల మాదిరిగానే మెటాకు కూడా చట్టపరంగా ఎన్నో బాధ్యతలు ఉంటాయని, ఇక మీదట తన ప్లాట్‌ఫామ్ కంటెంట్ విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుం దని వెల్లడించాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ చట్టాల ప్రకారం సోషల్ మీడియా కంపెనీలకు లభించే సేఫ్ హార్బర్ ఇమ్యూనిటీ లేదా చట్టపరమైన రక్షణపై కీలక వ్యాఖ్యలు చేసింది. మెటా తన ప్లాట్‌ఫామ్‌లో కంటెంట్ వ్యాప్తిని నియంత్రిస్తున్నందున, దానికి లీగల్ ఇమ్యూని టీ వర్తించదని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇక్కడ చట్టపరమైన సంరక్షణకు సంబంధించి తుది నిర్ణయం న్యాయస్థానాల చేతుల్లోనే ఉంటుందని, అది వాటి పరిధిలోని అంశం అని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్లాట్‌ఫామ్‌లోని లోపాలను, కంటెంట్ నియంత్రణలో జరిగిన పొరపాట్లను మెటా బహిరంగంగా ఒప్పుకుందని, ఈ క్రమంలోనే ఇప్పుడు మరింత జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని పేర్కొంది. 'ప్రతి సర్వీస్ ప్రొవైడర్‌కు కొన్ని బాధ్యతలు ఉంటాయి. మెటా తన ప్లాట్‌ఫామ్‌లో ఉన్న కంటెంట్‌కు బాధ్యత వహించేందుకు అంగీకరించిన తర్వాత నెక్స్ట్ ఫేజ్‌లో మరిన్ని బాధ్యతలు కూడా తీసుకోవాల్సి ఉంటుంది' అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

balagamtv100@gmail.com

# గ్రేట్ మహానగరి జిల్లాలు

## ● హైదరాబాద్ ● మేడ్చల్- రంగారెడ్డి

## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

- రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ



హైదరాబాద్, సెప్టెంబర్ 16 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయ మూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొద టి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## సంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

- వినాయక నిమజ్జనంలో అపశ్రుతి
- నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు మృతి



బలగం టీవీ, హైదరాబాద్ : సంగారెడ్డి జిల్లాలో వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. గణేశ్? నిమజ్జనానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఆరుగురు పిల్లలు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్?చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో చోటు చేసుకుంది. కాగా మృతులంతా శిరీష ఛారిటబుల్ ట్రస్ట్? విద్యార్థులుగా గుర్తించారు. ఒక్కసారిగా ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఇందిరమ్మ ఇండ్లు పథకంలో గుడ్‌న్యూస్



- గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం
- హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ విపి గౌతమ్ వెల్లడి

బలగం టీవీ, హైదరాబాద్ : తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోఅల్పదాయ వర్గాల కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ సొంతింటి పథకానికి సంబంధించి 20-07-2026 తేదీన జారీ చేసిన డిమాండ్ నోటిఫికేషన్ ద్వారా 16 అసెంబ్లీ నియోజకవ ర్గాల్లో గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం కల్పించినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ మరియు హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్, ఐఏఎస్ తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాల్లో ఏదైనా ఒక నియోజకవర్గం కింద దరఖాస్తు చేసుకొని, ప్రస్తుతం కింది నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నివసిస్తున్న అభ్యర్థులు తమ పాత దరఖాస్తును ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గానికి బదిలీ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు 1. ఎల్‌బీ నగర్, 2. గోషామహల్, 3. ముషీరాబాద్, 4. చాంద్రాయణగుట్ట అర్హులైన అభ్యర్థులు తమ పాత దరఖాస్తు వివరాలతో తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోని కింది లింక్ ద్వారా 20-09-2026లోగా దరఖాస్తు బదిలీ కోసం అభ్యర్థించాలని శ్రీ వి.పి. గౌతమ్ సూచించారు. అభ్యర్థి ప్రస్తుతం నివసిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గానికి మాత్రమే దరఖాస్తు బదిలీ చేయబడుతుందని, ఈ బదిలీ నివాస ధ్రువీకరణతో పాటు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించిన అన్ని అర్హతలు, నిబంధనల పరిశీలనకు లోబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం అభ్యర్థులు కొత్తగా లేదా ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించరాదన్నారు. దరఖాస్తు బదిలీ చేయడం వల్ల ఇంటి కేటాయింపుపై ఎలాంటి హక్కు ఏర్పడదని, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ మరియు నిర్దేశించిన కేటాయింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, ఎవరికీ ఎలాంటి నగదు చెల్లించవద్దని శ్రీ వి.పి. గౌతమ్ కోరారు. అధికారిక సమాచారం తెలంగాణ హౌసింగ్ బోర్డు అధీకృత మార్గాల ద్వారా మాత్రమే తెలియజేయబడుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా తెలంగాణ హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ నంబర్ 040-24603572ను సంప్రదించవచ్చు.

## చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

### స్థానిక సంస్థల ఎన్నికల కోసమే సంక్షేమ డ్రామా

### వైసీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

అమరావతి, సెప్టెంబర్ 16 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలపై బూటకపు ప్రచారం చేస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఇప్పుడు ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించి మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ అవే హామీలను వల్లె వేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బలహీన వర్గాలకు, మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయలేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేసిన తేదీ నుంచి కాకుండా, బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు తమ పింఛన్ల దరఖాస్తుల ఆమోదం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

# ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ ఆయుధ ప్యాకేజీ

### ఏడు అరబ్ దేశాల సైనికాధికారులతో భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్-17: పశ్చిమాసియాలో ఇరాన్- అమెరికా ఘర్షణ వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్‌కు 2.8 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.26 వేల కోట్లు) ఆయుధ ప్యాకేజీని అమెరికా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆయుధ ప్యాకేజీలో ఒక్కొక్కటి 900కిలోల బరువున్న 40,000 బాంబులు ఉండనున్నట్లు సమాచారం. ప్రతిపాదిత ప్యాకేజీలో 20,000 వీఖ-84 బాంబులు, 20,000 దీూఖ-117 బాంబులతో పాటు 20 వేల ×-2000 పెనెట్రేటర్ వార్‌హెడ్‌లు ఉండనున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో ఇజ్రాయెల్‌కు అమెరికా ఇంత భారీ మొత్తంలో ఆయుధాలను ఒకేసారి విక్రయించడం ఇదే అయి ఉంటుందని తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా అధికారులకు ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా తన కథనంలో పేర్కొంది.ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్ కోసం 2.8 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీని సిద్ధం చేస్తోంది. దీనికి యూఎస్ ఫారిన్ మిలిటరీ ఫైనాన్సింగ్ ప్రోగ్రామ్ ద్వారా నిధులు సమకూర్చనున్నారు. ఈ కార్యక్రమం కింద అమెరికన్ ఆయుధాలను కొనుగోలు చేయడానికి ఇజ్రాయెల్‌కు నిధులను వాషింగ్టన్ అందిస్తుంది. ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ గత జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ప్యాకేజీని దాటేసింది. ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ గురించి అమెరికా కాంగ్రెస్‌లోని సంబంధిత కమిటీలకు అనధికారికంగా సమాచారం అందింది. యూఎస్ సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ, అమెరికా హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీని ట్రంప్ ప్రభుత్వం సంప్రదించిందని అమెరికా మీడియా తన కథనంలో పేర్కొంది. 2.8 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీకి ఆమోదం తెలపాలని ఆ కమిటీలను కోరుతోందని స్పష్టం చేసింది. చరిత్రాత్మకంగా ఇజ్రాయెల్‌కు ఆయుధాల అమ్మకాలకు ఉభయపక్షాలు మద్దతు ఇచ్చాయని వెల్లడించింది. అయితే గాజా, ఇరాన్‌లోని సంఘర్షణల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు అమెరికా రక్షణ మద్దతు ఇవ్వడంపై కొంతమంది చట్టసభ సభ్యులు వ్యతిరేకత వ్యక్తం చేశారని చెప్పింది. ఇజ్రాయెల్‌కు అమెరికా సైనిక సాయంపై వాషింగ్టన్‌లో చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ సిద్ధం అయ్యిందని తెలిపింది. ఇజ్రాయెల్‌కు అమెరికా రక్షణ సహాయాన్ని నిలిపివేయడానికి మద్దతుగా ఈ ఏడాది జులైలో వంద మందికి పైగా డెమొక్రాట్లు ఓటు వేశారని నివేదించింది. అయినప్పటికీ రిపబ్లికన్ చట్టసభ సభ్యులు ఇజ్రాయెల్‌కు విస్తృతంగా మద్దతు ఇస్తూనే ఉన్నారని చెప్పింది. కాగా, అమెరికా ఆయుధాగారంలో ఉన్న అత్యంత విధ్వంసకరమైన బాంబుల్లో ఎంకే-84 ఒకటి. ఇది పేలిందంటే పెద్ద లోహపు శకలాలు వేలాది అడుగుల దూరంలో ఎగిరిపడే అవకాశం ఉంది. అలాగే ఈ బాంబు దృఢమైన నిర్మాణాలను సైతం పేల్చేయగలదు. ఇజ్రాయెల్ ఈ తరహా బాంబులను లెబనాన్, గాజాలో గతంలో పలు సార్లు ప్రయోగించింది. దాంతో అప్పట్లో బైడెన్ ప్రభుత్వం వాటి డెలివరీని నిలిపిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే డొనాల్డ్ ట్రంప్ రెండో సారి 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిలుపుదలను ఎత్తివేశారు. జన సాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇలాంటి భారీ బాంబులను ఉపయోగించడం వల్ల పౌరుల ప్రాణాలకు తీవ్ర నష్టం జరుగుతుందని మానవ హక్కుల సంఘాలు అప్పట్లో ఆందోళన వ్యక్తం చేశాయి. అయినా ట్రంప్ వెనక్కి తగ్గలేదు. అయితే గాజా, లెబనాన్‌లలో ఇజ్రాయెల్ సైనిక చర్యల నేపథ్యంలో ఈ ప్రతిపాదిత ప్యాకేజీ సిద్ధమవ్వడం గమనార్హం. కాగా, ఇజ్రాయెల్ రక్షణ అవసరాలకు అమెరికా మొదటి నుంచి అండగా ఉంటోంది. కాగా.. అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు ఏడు అరబ్ దేశాలకు చెందిన అత్యున్నత స్థాయి సైనికాధికారులు జర్మనీలో రహస్యంగా సమావేశమయ్యారు. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం, ప్రాంతీయ భద్రత, హూతీల దాడులు, హర్మూజ్ జలసంధి పరిస్థితులపై ఈ భేటీలో చర్చించినట్లు అని ఆక్సియోస్ నివేదిక వెల్లడించింది. అమెరికా సెంట్రల్ కమాండ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌తో పాటు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఈజిప్ట్‌కు చెందిన సైనికాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఆయా ప్రభుత్వాలు ముందుగా ఈ సమావేశాన్ని అధికారికంగా ప్రకటించలేదు. కానీ జర్మనీలో ఎనిమిది దేశాల సీనియర్ సైనికాధికారులతో షెడ్యూల్ ప్రకారం సమావేశం నిర్వహించినట్లు సెంట్?కామ్ ధ్రువీకరించింది. ప్రాంతీయ భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడమే సమావేశం ఉద్దేశమని తెలిపింది. ఇరాన్? నుంచి అమెరికా సైనిక స్థావరాలపై దాడులు కొనసాగుతున్నప్పటికీ, పశ్చిమాసియా నుంచి తమ బలగాలను ఉపసంహరించుకునే ఆలోచన లేదని బ్రాడ్? కూపర్ భేటీలో చెప్పినట్లు ఆక్సియోస్ కథనం వెల్లడించింది. అలాగే హర్మూజ్ జలసంధి మీదుగా వాణిజ్య నౌకల రాకపోలకు మరింత పెంచేందుకు అమెరికా అనుసరిస్తున్న వ్యూహాల గురించి ఆయన వివరించినట్లు తెలిపింది. అదే సమయంలో వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఇజ్రాయెల్ సైనిక చర్యల గురించి ఐడీఎఫ్? చీఫ్? ఆఫ్? స్టాఫ్? జనరల్ ఎయాల్ జమీర్ వివరించినట్లు పేర్కొన్నాయి.ఇరాన్ యుద్ధంతో పాటు యెమెన్‌కు చెందిన హూతీల కార్యకలాపాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. సౌదీ అరేబియాపై హూతీల దాడులు పెరగడంతోపాటు బాబ్ అల్-మందెబ్ ప్రాంతంలో పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో హూతీలకు వ్యతిరేకంగా సౌదీ అరేబియా చేపడుతున్న సైనిక చర్యలకు ఇజ్రాయెల్ నుంచి నిఘా, సమాచార సహకారం వంటి మద్దతు అందించే అవకాశాలపై అమెరికా సెంట్రల్ కమాండ్ భాగస్వామ్యంతో చర్చలు జరుగుతున్నట్లు నివేదికలు వెల్లడించాయి. అయితే ఈ అంశంపై ఏదైనా తుది ఒప్పందం కుదిరిందని అధికారికంగా ప్రకటించలేదు.

## దానం అనర్హతపై విచారణ వాయిదా



హైదరాబాద్,సెప్టెంబర్-17: ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టులో కీలక వాదనలు జరిగాయి. దానం బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరటం పైన హైకోర్టులో దాఖలైన పిటీషన్ ను న్యాయస్థానం విచారణ చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో కీలకంగా మారింది. ఈ పిటీషన్ ను విచారణ చేసిన న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెల్లడించాల్సి ఉండగా శుక్రవారానికి వాయిదా వేసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టు శుక్రవారం తీర్పు వెల్లడి చేయనుంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్ని కై, ఆ తర్వాత కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన దానంపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను స్పీకర్ కొట్టివేసారు దీంతో.. ఇదే అంశం పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేసింది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్.. ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని, పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, కే వివేక్‌రెడ్డి ఇప్పటికే హైకోర్టుకు తెలిపారు. ముఖ్యంగా దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో అత్యంత కీలక ఆధారమని తమ వాదనల్లో స్పష్టం చేసారు. అదే విధంగా పార్టీ ఫిరాయింపును నిర్ధారించేందుకు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యే వ్యవహరించిన తీరును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాల న్న స్పీకర్ వైఖరిని పిటిషనర్లు వ్యతిరేకించారు. మరో పార్టీ తరఫున పోటీచేయడం ద్వారా అసలు పార్టీ పట్ల తన రాజకీయ అనుబంధాన్ని వదులుకు న్నట్టు స్పష్టమవుతున్నప్పుడు వేరే ఆధారాల కోసం చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పీకర్ నిర్ణయం న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటుందని, స్పీకర్ అధికారాలు అపరిమితమైనవి కావని వాదించారు. పిటిషనర్ల వాదనలతో దానం నాగేందర్ న్యాయవాది వ్యతిరేకించారు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వాన్ని తీసుకున్నట్టు ఎకడా ప్రకటించలేదని తెలిపారు. దానం ఇప్పటికీ అసెంబ్లీ రికార్డుల్లో బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని చెప్పారు. దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసినంత మాత్రాన అసెంబ్లీ సభ్యత్వం కోల్పోయినట్టు భావించరాదని వాదించారు. వాదనలు విన్న తరువాత ధర్మాసనం ఈ రోజు వెల్లడించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయ స్థానం నిర్ణయం తీసుకుంది.

## కోటి ఎకరాలు కాదు.. కేవలం 3.60 లక్షల ఎకరాలే

- నిషేధిత జాబితాపై
  విపక్షాల తప్పుడు లెక్కలు
- 22ఏపై బీఆర్ఎస్
  అసత్యాలు మాట్లాడుతోంది
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
  తీవ్ర విమర్శలు



బలగం టీవీ, హైదరాబాద్ : తెలంగాణలో సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ పార్టీ పచ్చి అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'ధరణి' పోర్టల్ ద్వారా కొందరు నేతలు భూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఆనాటి పాలకులు చేసిన చారిత్రక తప్పిదాలను ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో సరిదిద్దుతుంటే ఓర్వలేక నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏకంగా కోటి ఎకరాల భూములను 22ఏ జాబితాలో చేర్చారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వాస్తవానికి హైకోర్టు ఆదేశాలు, తీవ్రమైన న్యాయపరమైన వివాదాలు ఉన్న కేవలం 3.60 లక్షల ఎకరాల భూములను మాత్రమే నిబంధనల ప్రకారం నిషేధిత జాబితాలో ఉంచినట్లు స్పష్టం చేశారు. అధికారుల తప్పిదం వల్ల ఎక్కడైనా చిన్నపాటి లోపాలు తలెత్తితే వాటిని ప్రభుత్వం వెంటనే సరిదిద్దుతోందని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే సభకు హాజరుకాకుండా 'మాక్ అసెంబ్లీ'ల పేరుతో నాటకాలు ఆడటం బీఆర్ఎస్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సభాపతిని, దళిత వర్గాలను, విధి నిర్వహణలో ఉన్న పోలీసులను అవమానిస్తూ ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.పదేళ్లలో ధరణి అడ్డం పెట్టుకుని జరిగిన భూ దారుణాలను త్వరలోనే ఆధారాలతో సహా అసెంబ్లీ వేదికగా బట్టబయలు చేస్తామని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

## శ్రీవారి భక్తులకు స్కైవాక్ బ్రిడ్జి

### టీటీడీ పైన సిఎం ఉన్నత స్థాయి సమీక్ష

అమరావతి,సెప్టెంబర్-17: తిరుమల భక్తుల కోసం సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేసారు. తిరుమలలో భక్తులకు మరింత మెరుగైన సేవలు, సౌకర్యాలు అందించే లక్ష్యంతో టీటీడీ చేపట్టిన పలు వినూత్న కార్యక్రమాలను ప్రారంభించారు. టీటీడీ పైన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. శ్రీవాణి నిధులతో ఆలయాల నిర్మాణం పైన సూచనలు అందించారు. అదే విధంగా శ్రీవారి సేవకుల సేవల విస్తరణ పైనా చర్చ జరిగింది. ఇక.. తిరుపతిలో స్కై వాక్ నిర్మాణం పైన చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రహ్మోత్సవాల వేళ శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఇదే సమయంలో తిరుమల హీలింగ్ అండ్ డివోషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, దుర్లభ దర్శన్ వీఆర్ అనుభవం, ఎలక్ట్రిక్ బస్సులు, శ్రీ వేంకటేశ్వర మ్యూజియం, నందకం యాప్, భక్తులకు గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం ప్రారంభించారు. టీటీడీ సమీక్ష వేళ పలు నిర్ణయాలు తీసుకున్నారు. అందు లో భాగంగా తిరుపతిలో భక్తులు మరియు పాదచారుల సౌకర్యార్థం రైల్వే స్టేషన్ - బస్టాండ్ మధ్య నూతనంగా "స్కైవాక్" బ్రిడ్జ నిర్మాణానికి ప్రతిపాదనల పైన చర్చించారు. అందుబాటులోకి తెచ్చే విధంగా యాక్షన్ ప్లాన్ ఖరారు చేసారు. పవిత్రమైన దివ్యక్షేత్రంగా తిరుమలను అభివృద్ధి చేయాల నే లక్ష్యంతో పనిచేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. 89.5 శాతం గ్రీన్ కవర్ తిరుమల కొండల్లో ఉందని.. గతంలో ఏర్పాటు చేసిన ఎస్వీ మ్యూజియం ను ఆధునీకరించి పునః ప్రారంభం చేశామని వెల్లడించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం లాంటి అంశాలను ప్రదర్శించేలా మ్యూజిఎంలో ఏర్పాటు చేశామని చెప్పారు. కాగా, భక్తులు అందరికీ అర్థం అయ్యేలా వివిధ అంశాలను ఏర్పాటు చేశారు. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో ఈ మ్యూజియంను ఏర్పాటు చేశారు. వచ్చే ఐదేళ్ల పాటు ఈ మ్యూజియం నిర్వహణను కూడా ఆ ట్రస్ట్‌కే అప్పగించాలని నిర్ణయించామన్నారు.

## సిఎం, టీపీసీసీ మధ్య అత్యుత్తమ సమన్వయం

### ఆ ఇద్దరూ మళ్లీ పార్టీని అధికారంలోకి తెస్తారు

### శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

బలగం టీవీ, హైదరాబాద్ :
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య అత్యుత్తమ పరిపాలనా, రాజకీయ సమన్వయం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విజన్, పార్టీ నిర్మాణం ఒకే దిశలో పయని స్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరిగి ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో చర్చించాలనే తాము భావించామని... అయితే సభకు ముఖం చాటేసే వ్యూహంతోనే కావాలని గందరగోళం సృష్టించి వారు సభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు శాసనసభ ప్రజాస్వామ్య నియమావళి, సభ నిర్వహణ అస్సలు నచ్చవని విమర్శించారు. తమ పదేళ్ల పాలనలో అసెంబ్లీని అతి తక్కువ రోజులు నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా సుదీర్ఘంగా సభను నిర్వహిస్తుంటే తట్టుకోలేక పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలిచేస్తోందని శ్రీధర్ బాబు దుయ్యబట్టారు.

## 13 రోజులు దసరా సెలవులు

### అక్టోబర్ 1 నుంచి 9 వరకు సెలవులు

### విద్యాశాఖ కీలక షెడ్యూల్ విడుదల



హైదరాబాద్,సెప్టెంబర్-17: తెలంగాణలో దసరా సెలవులపై విద్యాశాఖ బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్ఏ-1) పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవుల తేదీలను కూడా తాజాగా ప్రకటించింది. అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించనుండగా.. ఆ తర్వాత అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఉండనున్నాయి. అంటే ఈసారి దసరా పండగకు వరుసగా 13 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు రానున్నాయి. తెలంగాణలోని పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా తరగతుల వారీగా వేర్వేరు సమయాలను విద్యాశాఖ కేటాయించింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు.. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. 6, 8వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 7వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. తరగతుల వారీగా ఏ రోజు ఏ సబ్జెక్టుకు పరీక్ష నిర్వహించనున్నారనే పూర్తి టైమ్‌టేబుల్‌ను విద్యార్థులు తమ పాఠశాలల ద్వారా తెలుసుకోవాలని విద్యాశాఖ సూచించింది.ఎస్ఏ-1 పరీక్షలు పూర్తి అయిన వెంటనే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 10వ తేదీ నుంచి అక్టోబర్ 22వ తేదీ వరకు రాష్ట్రంలోని పాఠశాలలకు సెలవులు ఉండనున్నాయి. అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు లెక్కిస్తే మొత్తం 13 క్యాలెండర్ రోజులు సెలవులు రానున్నాయి. ఈసారి బతుకమ్మ, దసరా పండుగలు కూడా ఇదే సెలవుల సమయంలో రావడంతో విద్యార్థులకు వరుసగా సెలవులు లభించనున్నాయి.దసరా సెలవులకు ముందు ఎస్ఏ-1 పరీక్షలు ఉండటంతో విద్యార్థులు ముందుగానే ప్రిపరేషన్ పూర్తి చేసుకోవాలని విద్యాశాఖ సూచించింది.పరీక్షల అనంతరం అక్టోబర్ 10వ తేదీ నుంచి సెలవులు ప్రారంభం కానున్నందున విద్యార్థులు తమ పాఠశాలల్లో అందించే పూర్తి టైమ్ టేబుల్‌ను పరిశీలించి పరీక్షలకు సిద్ధం కావాల్సి ఉంటుంది. అక్టోబర్ 23వ తేదీ నుంచి పాఠశాలలు సాధారణంగా పునఃప్రారంభం కానున్నాయి. తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 1వ తరగతినుంచి10వ తరగతివిద్యార్థులకు ఈ షెడ్యూల్ కీలకంగా మారింది.

# (మొదటిపేజీ తరువాయి)

## 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు. ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు. 2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చలవిడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు.తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో కాగ్? ధరణిపై తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్?ఎఫ్?ఎస్? దక్కించుకుందని వివరించారు. ఐఎల్?ఎఫ్ఎస్?, ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు.మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు.

## సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

దెబ్బతీసేలా ఉంటే వాటిని తొలగించాలనే గళాన్ని వినిపించే వాళ్లు ఇప్పుడు అవసరం అయ్యారని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, పన్నుల వసూళ్ల రంగానికి దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూర్చే అంశాలపైనే ప్రతి ఒక్కరూ ప్రధానంగా దృష్టి సారించాలని నిర్మల సీతారామన్ చెప్పారు. పన్ను నిబంధనల సవరణలపై ప్రతిపాదనలు చేసేటప్పుడు పూర్తి సమాచారంతో కూడిన నివేదికలను సమర్పించాలని కోరారు. ఏదైనా నిబంధన వల్ల పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుంటే, దాని వల్ల ఎంతమంది ప్రభావితమవుతున్నారు, ఎంత సమయం, వ్యయం వృథా అవుతుందనే వివరాలను గణాంకాలతో సహా నిరూపించాలని కోరారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటో కూడా ప్రతిపాదించాలని, ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఆదాయంపై పడే ప్రభావాన్ని నిశితంగా అంచనా వేయాలని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. వీటి వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుంది, పన్ను పరిధి ఏ మేరకు ప్రభావితమవుతుంది, పన్నుల నిర్వహణపై ఎలాంటి ఫలితాలు ఉంటాయనే విషయాన్ని సమగ్రంగా విశ్లేషించడం ఎంతైనా అవసరమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పన్ను విధానాలను సరళీకరిస్తూనే, దేశ ఆర్థిక వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. నిబంధనల మార్పు ఒక వర్గానికి మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక రంగానికి మేలు చేసేలా ఉన్నప్పుడే నిజమైన సంస్కరణలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. పన్నుల పరిధిని విస్తృతం చేస్తూనే, విధానపరమైన అడ్డంకులను తొలగించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

## 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

## ధరణి, భూభారతిపై.. విచారణకు సిద్ధమా?

హైదరాబాద్,సెప్టెంబర్-17: తెలంగాణలో భూ భారతి పేరుతో జరుగుతున్న భూ కుంభకోణాలు, అప్పనంగా ఇస్తున్న భూములు, రైతుల, సామాన్యుల భూములతో చెలగాటమాడుతున్న 22ఏతోపాటు ముఖ్యమంత్రి సోదరుల భూ కుంభకోణాలపై ఎలాంటి తప్పులు జరుగకపోతే రేవంత్ సర్కార్ ఎందుకు భయపడుతున్నదని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ తప్పూ చేయకపోతే సిట్టింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావాలని సవాల్ విసిరారు. బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో ముఖ్యమంత్రి, ఆయన సోదరులు చేస్తున్న భూ కుంభకోణాలపై మీడియాతో మాట్లాడారు. 'నీ తమ్ముడు లక్ష రూపాయల మూలధనంతో పెట్టిన కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కేటాయించిన విషయం బయటపెట్టిందే బీఆర్ఎస్. దాని మీద ప్రభుత్వ గొంతు ఎందుకు మూగబోయింది?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'డైమండ్‌హిల్స్, గచ్చిబౌలి కుంభకోణం, రాందాస్‌పల్లి కుంభకోణం, కారామెట్‌లో సురేశ్‌బాబుకు సంబంధించిన భూ కుంభకోణం.. విఠలారాధా గచ్చిబౌలి కుంభకోణం, రాఘవ-ఫీనిక్స్ మధ్య జరిగిన అక్రమ కుంభకోణాల మీద ఎందుకు మాట్లాడరు? ఎందుకు వాటికి సమాధానం ఇవ్వరు? ఒకవేళ మీరు తప్పు చేయకపోతే సిట్టింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావచ్చు కదా? ఎందుకు రావడం లేదు?' అని హరీశ్‌రావు నిలదీశారు.ధరణితో నిమిషాల్లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్..ధరణిలో 2020 అక్టోబర్ నుంచి జనవరి 2023 వరకు 23,20,233 ట్రాన్సాక్షన్స్ అయ్యాయని హరీశ్‌రావు చెప్పారు. 17,30,909 రిజిస్ట్రేషన్లు జరిగితే, వాటిల్లో 16,59,866 పరిష్కారమయ్యాయని చెప్పారు. ఆ సమస్య పరిష్కరించడానికి తీసుకున్న సగటు సమయం 47 నిమిషాలేనని తేల్చారు. '47 నిమిషాల్లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్త యింది. వారసత్వ హకులు సక్సెషన్ 1,98,208 మందికి వారసత్వం, సక్సెషన్ జరిగింది. అందుకు తీసుకున్న సగటు సమయం 26 నిమిషాలు. 24,22,874 పార్టీషన్ డీడ్స్ జరిగితే సగటు సమయం 31 నిమిషాలు. పెండింగ్ మ్యుటేషన్లలో 1,79,216 మ్యుటేషన్లకు తీసుకున్న సమయం 32 నిమిషాలు. 95,676 నాలా కన్వర్షన్లకు తీసుకున్న సమయం 28 నిమిషాలు' అని హరీశ్‌రావు వివరించారు. అంత చకగా కొన్ని గంటల వ్యవధిలో, నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, నాలా కన్వర్షన్లు లక్షల మందికి జరిగితే.. ఎకడో ఒకటో రెండో చిన్న పొరపాట్లను సరిదిద్దాల్సిన ప్రభుత్వం.. అలా చేయకుండా చాలెంజ్ స్కామ్‌కు వేదికైన భూభారతిని తెచ్చిందన్నారు. 'భూ భారతి ద్వారా ప్రజలకు తెలియకుండా ప్రజల ఆస్తులను బదిలీ చేశారు.

# ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

బలగం టీవీ, హైదరాబాద్ : రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం శాసనసభలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ పథకాల కింద అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటల వైపు రైతులను మళ్లించేందుకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగు విస్తరణకు అవసరమైన మొక్కలు, ఎరువులు, మల్చింగ్, షేడ్‌నెట్, ఫామ్ పాండ్లు, శీతల గిడ్డంగులు, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం వంటి సదుపాయాలను నిబంధనల ప్రకారం 40 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీపై అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 2026--27లో మొక్కలు, మల్చింగ్, షేడ్‌నెట్, కోత అనంతర నిర్వహణ సదుపాయాలు, శీతల గిడ్డంగులు, ఉద్యాన యాంత్రీకరణ, శాశ్వత పందిళ్ల కోసం రూ.150 కోట్లు, బిందు, తుంపర సేద్యం కోసం రూ.243 కోట్లు, ఆయిల్‌పామ్ అభివృద్ధికి రూ.261 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. టీవీజుూ-న్రా పథకం కింద 2021--22 నుంచి ఇప్పటివరకు 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి 1.37 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించామని చెప్పారు. 2026--27 సంవత్సరానికి 85 వేల ఎకరాల లక్ష్యా నికి గాను ఇప్పటివరకు 29,053 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు మంత్రి వెల్లడించారు. సాంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్‌కు ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ పంటను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు మొక్కలు, డ్రిప్, మొదటి నాలుగేళ్లకు ఎరువులు, అంతర పంటల సాగు తదితరాలకు కలిపి ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఫామ్‌పాండ్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ చట్టం--1993 ప్రకారం ఫ్యాక్టరీ జోన్ కేటాయించిన ప్రతి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రతి నెలా ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర ఉందన్నారు. కనీస హామీ ధర (వీ-ఫూ) ప్రకటించాల్సింది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, అయినప్పటికీ రైతులకు మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని వీ-ఫూ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో అశ్వారావుపేట, అప్పారావుపేట, నర్మెట్టలో, గోద్రెజ్ ఆధ్వర్యంలో అంజనాపురంలో మిల్లులు పనిచేస్తున్నాయని చెప్పారు. మరో ఆరు మిల్లుల నిర్మాణ పనులు కల్లూరుగూడెం, ఇంచెర్ల, పెద్దరాతు, రేగొండ/చిన్నపాక, యాచారం, శంకరంరెడ్డిపల్లి ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని, వచ్చే ఏడాదికి ఇవి అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకు ంటున్నామని తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రిఫైనరీ, ఆధునిక ప్యాకేజింగ్ కేంద్రం ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. మిల్లుల ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తున్న ప్రాంతాల్లో ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఒక ఫ్యాక్టరీ నిరంతరాయంగా పనిచేయాలంటే కనీసం 10 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట హార్వెస్టింగ్ దశకు రావాల్సి ఉంటుందని వివరించారు. ఇప్పటికే పలు ఫ్యాక్టరీలకు అనుమతులు ఇచ్చి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అన్ని ఉమ్మడి జిల్లాల్లో మిల్లుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ములుగు, భూపాలపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే ఫ్యాక్టరీల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించామని, జనగామ, మహబూబా బాద్ ప్రాంతాల్లో కూడా ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తున్నందున అక్కడ అదనపు ప్రాసెసింగ్ సదుపాయాల ఏర్పాటుపై దృష్టి సారి స్తున్నామని మంత్రి తెలిపారు.

# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్..

- పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తాం
- సింగపూర్ ప్రతినిధులతో సీఎం కీలక భేటీ
- సుముఖత వ్యక్తం చేసిన సింగపూర్ బృందం



బలగం టీవీ, హైదరాబాద్ : భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీ కండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది. రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్-జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, తొలిదశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్-షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

# ఉప్పు ఉత్పత్తికి నెలకొన్న సంక్షోభం!

### వాతావరణ మార్పులతో ఆటంకం

బలగం టీవీ, న్యూఢిల్లీ:

వాతావరణ మార్పుల ప్రభావం దేశంలోని కీలక రంగాలపై తీవ్రంగా పడుతోంది. తాజాగా ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఉప్పు ఉత్పత్తిదారుగా ఉన్న భారత్‌లో ఈ సంక్షోభం స్పష్టంగా కనిపిస్తోంది. అకాల వర్షాలు, తరచూ సంభవిస్తున్న తుపానులు, రుతుపవనాల తీరులో మార్పులు వంటి కారణాలతో ఉప్పు ఉత్పత్తి తీవ్రంగా దెబ్బ తింటోంది. ముఖ్యంగా దేశంలోనే అత్యధికంగా ఉప్పును ఉత్పత్తి చేసే గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లోని ఉప్పు రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. భారత్‌లో ఏటా సగటున 30.7 మిలియన్ టన్నుల ఉప్పు ఉత్పత్తి అవుతుంది. ఇందులో సింహభాగం, అంటే దాదాపు 85 నుంచి 87 శాతం గుజరాత్ నుంచే వస్తుంది. సంప్రదాయబద్ధంగా సముద్రపు నీటిని గానీ, భూగర్భంలోని ఉప్పు నీటిని గానీ విశాలమైన మడుల్లోకి (ప్యాన్‌లు) పంపి, సూర్యరశ్మికి ఆవిరయ్యేలా చేయడం ద్వారా ఉప్పును తయారు చేస్తారు. ఈ ప్రక్రియకు సుదీర్ఘమైన పొడి వాతావరణం, తగినంత సూర్యరశ్మి అవసరం. వర్షపాతం వీలైనంత తక్కువగా ఉండాలి. కానీ, మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ఈ ప్రక్రియకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. గుజరాత్‌లోని కచ్ ఎడారి ప్రాంతం, తమిళనాడులోని తూత్తుకుడి, మరక్కాణం వంటి తీర ప్రాంతాల్లోని ఉప్పు క్షేత్రాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయి. అకాల వర్షాలు కురవడం వల్ల మడుల్లోని ఉప్పునీటి గాఢత తగ్గిపోతోంది. దీంతో నీరు ఆవిరయ్యే ప్రక్రియ నెమ్మదిస్తుంది. కొన్నిసార్లు, తయారైన ఉప్పు స్ఫటికాలు వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయి. దీనివల్ల ఉత్పత్తి కాలం తగ్గిపోవడమే కాకుండా, దిగుబడి కూడా గణనీయంగా పడిపోతోంది. గుజరాత్‌లో రుతుపవనాలు ఆలస్యంగా ప్రారంభం కావడం లేదా ఎక్కువ కాలం కురవడం వల్ల ఉప్పు తయారీ సీజన్ ఆలస్యమవుతోంది. తమిళనాడులోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో, కొన్నిసార్లు అక్కడి వ్యాపారులు గుజరాత్ నుంచి ఉప్పును దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. లిటిల్ రాణ్ ఆఫ్ కచ్‌లోని ఉప్పు రైతులపై 2026లో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం.. మారుతున్న వర్షపాత సరళి, విపరీతమైన వాతావరణ పరిస్థితులు ఉత్పత్తిని దెబ్బతీస్తున్నాయని తేలింది. ఉష్ణోగ్రతలలో మార్పులు కూడా నీరు ఆవిరయ్యే వేగాన్ని, స్ఫటికాల ఏర్పాటును ప్రభావితం చేస్తున్నాయని ఆ అధ్యయనం పేర్కొంది. తీర ప్రాంతాల్లో తుపానులు, బలమైన గాలులు మరో పెను సవాలుగా మారాయి. రైతులు తమ మడుల చుట్టూ గట్లు నిర్మించుకుని రక్షణ చర్యలు తీసుకుంటున్నా, అవి పెద్ద వర్షాలు, వరదల ముందు నిలవలేకపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు పరిశోధనా సంస్థలు ప్రత్యామ్నాయ టెక్నాలజీలపై దృష్టి సారించాయి. ప్రతికూల వాతావరణంలోనూ నీటిని వేగంగా ఆవిరి చేసే పద్ధతులపై ప్రయోగాలు జరుగుతున్నాయి. అయితే, ఈ టెక్నాలజీలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి. పెద్ద ఎత్తున క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో దేశీయ ఉప్పు ఉత్పత్తిపై మరింత ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఎఫ్‌టీఏ బిల్లుకు ఆమోదం

- భారత్‌తో భారీ డీల్ కుదుర్చుకున్న న్యూజిలాండ్
- 95 శాతం ఎగుమతులపై సుంకాల తగ్గించే చాన్స్!



బలగం టీవీ, న్యూఢిల్లీ: భారత్-న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలక ముందడుగు పడింది. ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమలుకు అవసరమైన బిల్లును న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 93 మంది ఎంపీలు ఓటేయగా.. 29 మంది వ్యతిరేకించారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన వెంటనే న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వెళ్లే ఎగుమతుల్లో 57 శాతానికి సుంకం ఉండదు. పూర్తిస్థాయిలో అమలు జరిగితే 95 శాతం ఎగుమతులపై సుంకాలు పూర్తిగా తొలగిపోవడం లేదా భారీగా తగ్గడం జరుగుతుంది. దీంతో భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు మరింత అవకాశం దక్కనుంది. కివీ పండ్ల పరిశ్రమకు ఈ ఒప్పందం భారీ ఊరటనివ్వనుంది. వచ్చే ఐదేళ్లలో సుంకాల రూపంలో సుమారు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్లు ఆదా అవుతాయని అంచనా. సరిహద్దుల్లో సరకుల తనిఖీ, క్లియరెన్స్ ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. భారత్‌లో పెరుగుతున్న మధ్యతరగతి.. న్యూజిలాండ్ ఎగుమతిదారులకు పెద్ద మార్కెట్‌గా మారుతోందని ఆ దేశ వాణిజ్య, పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్లే చెప్పారు. ఆహారం, టెక్నాలజీ, విద్య, పర్యాటకం, ప్రొఫెషనల్ సర్వీసెస్‌కు భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను న్యూజిలాండ్ కంపెనీలు ఉపయోగించుకో వచ్చని తెలిపారు. ఇరు దేశాల ఆమోద ప్రక్రియలు పూర్తయిన తర్వాత ఎఫ్‌టీఏ అమల్లోకి వస్తుంది. ఈ ఏడాది చివర్లోనే ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని మెక్లే చెప్పారు. 2030 నాటికి భారత్-న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా.. వెస్ట్‌పాక్ ఇన్‌స్టిట్యూషనల్ బ్యాంక్ ఇటీవల ఇచ్చిన నివేదికలోనూ భారత్ వృద్ధి అవకాశాలను ప్రస్తావించింది. ఎఫ్‌టీఏ వల్ల వచ్చే పదేళ్లలో న్యూజిలాండ్ జీడీపీకి దాదాపు 0.1 శాతం అదనపు వృద్ధి రావచ్చని అంచనా వేసింది.

# తెలంగాణ

## భార్య ముక్కు కొరికేసిన భర్త...

### మంచిర్యాలలో దారుణ ఘటన

హైదరాబాద్,సెప్టెంబర్-17: తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ఓ కిరాతక ఘటన వెలుగుచూసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో ఆగ్రహానికి లోనైన భర్తే, భార్య ముక్కు కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ అమానుష ఘటన బుధవారం కొటపల్లి మండలంలో చోటుచేసుకుంది. మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మమత తన పుట్టింట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో భార్యను తిరిగి తన వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ నేడు అత్తవారింటికి వెళ్లాడు. అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేశాడు. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మమతపై కూడా అతను విచక్షణారహితంగా దాడి చేసి, ఆమె ముక్కును కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలి ముక్కు భాగం తీవ్రంగా దెబ్బతింది. స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే

### అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు

### తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ



హైదరాబాద్, సెప్టెంబర్ 16 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

## పిటిషన్లకు విచారణార్హత లేదు

### వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు వెల్లడి

అమరావతి, సెప్టెంబర్ 16 : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో నాంపల్లిలోని ప్రత్యేక సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. తమపై నమోదైన తీవ్ర అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ప్రధాన నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. కేసులో ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్ రెడ్డి, ఏ6 గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు డిశ్చార్జ్ పిటిషన్లను సమగ్రంగా విచారించిన కోర్టు, వాటికి ఎలాంటి విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్లు, సాంకేతిక ఆధారాలు, సమర్పించిన సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... నిందితులపై ఉన్న అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టం చేసింది.

## ఉత్తరాంధ్రకు భారీ వర్ష సూచన

**ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం!**

**ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా వైపుకు అల్పపీడనం**

అమరావతి, సెప్టెంబర్ 16 : బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 19) సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.

## అధికార లాంఛనాలతో ఆళ్ల నాని అంత్యక్రియలు

అమరావతి, సెప్టెంబర్ 16 :మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని నిన్న విశాఖలో గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలకు సంబంధించి కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విదేశాల్లో ఉన్న ఆయన ఇద్దరు కుమారులు ఈ రాత్రికి స్వదేశానికి చేరుకోనుండటంతో, కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు రేపు ఏలూరు నగరంలో ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం, పోలీసులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న ఆళ్ల నాని, ఏలూరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వైసీపీ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా, వైద్యారోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన, 2024 ఎన్నికల అనంతర పరిణామాల్లో తెలుగుదేశం పార్టీలో చేరారు.

## నేడు వారణాసికి సీఎం చంద్రబాబు

**'సేవా సంకల్ప్ అభియాన్'కు హాజరు**

అమరావతి, సెప్టెంబర్ 16 :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు గురువారం (సెప్టెంబర్ 17) వారణాసిలో పర్యటించ నున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ ప్రస్థానాన్ని పురస్కరించుకుని కాశీలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా మోదీ అందించిన సేవలకు గుర్తుగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాని రాజకీయ జీవితంతో ముడిపడిన వారణాసి, ఆయన స్వస్థలం వాద్‌నగర్‌ను కలుపుతూ 'వారణాసి--వాద్‌నగర్ సేవా యాత్ర'ను చేపట్టారు. యువత, ప్రజాప్రతినిధులు, సేవా సంస్థల భాగస్వామ్యంతో జరిగే ఈ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని సేవా యాత్రకు ఫ్లాగ్ ఆఫ్ చేస్తారు. దేశాభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి అంశాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఉదయం 7:30 గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9:35 గంటలకు వారణాసి చేరుకుంటారు. ఉదయం 11:15 గంటలకు శ్రీ కాశీ విశ్వనాథుని దర్శించుకుంటారు. అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 3:10 గంటలకు వారణాసి నుంచి తిరుగుపయనమై సాయంత్రం 5:15 గంటలకు అమరావతికి చేరుకుంటారు.

## రేపల్లె నేత మోపిదేవి శ్రీనివాసరావును సస్పెండ్

**గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారని ఆరోపణ**

అమరావతి, సెప్టెంబర్ 16 : రేపల్లె నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత మోపిదేవి శ్రీనివాసరావును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైసీపీ అధినేత జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఐదు నెలల క్రితమే (గత మే నెలలో) శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీని వీడి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. అత్యల్ప కాలంలోనే సస్పెన్షన్ వేటు పడటం బాపట్ల జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గం నుంచి పోటీ చేసి శ్రీనివాసరావు ఓటమిపాలయ్యారు. అయితే, వైసీపీలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక వైసీపీలో సమాంతర గ్రూపు రాజకీయాన్ని నడుపుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. రాబోయే ఎన్నికల్లో రేపల్లె ఎమ్మెల్యే టికెట్ తనకే ఖరారైందంటూ నియోజకవర్గంలో ప్రచారం చేసుకోవడంపై స్థానిక కేడర్ అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. మరోవైపు వర్గపోరు ప్రోత్సహించే నేతలను ఉపేక్షించకూడదనే ఉద్దేశంతోనే జగన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

**నెల్లూరులో ఆధునిక పాఠశాలలను ప్రారంభించిన మంత్రి లోకేశ్**



అమరావతి, సెప్టెంబర్ 16 : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నెల్లూరు నగరంలో మరో ముందడుగు పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేసిన రెండు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన నెల్లూరు చేరుకోగా, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా పలువురు జిల్లా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెందిన వీపీఆర్ ఫౌండేషన్ అందించిన రూ.8.3 కోట్ల ఆర్థిక సహకారంతో సమూలంగా ఆధునికీకరించిన ఆర్.ఎస్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ పాఠశాలలో మొత్తం 43 తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ బోధన కోసం ప్రతి గదిలో ఎల్ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రయోగాత్మక, సాంకేతిక విద్య అందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తూ పాఠశాలలో ఎకరం విస్తీర్ణంలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టును, అవుట్‌డోర్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూలపేట 39వ డివిజన్‌లో రూ.13.4 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునికీకరించిన దేవిరెడ్డి శారద (డీఎస్ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను కూడా లోకేశ్ ప్రారంభించారు. పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం, ఆర్.ఎస్.ఆర్. పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయుడు, ఇతర అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. కేవలం భవనాలు నిర్మిస్తే సరిపోదని, విద్యా ప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ దేశాలు చొరవ తీసుకోవాలి

ప్రపంచవ్యాప్తంగా నేడు జరుగుతున్న యుద్ధాలపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ యుద్ధాలవల్ల ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభం లోకి నెట్టింది. నేడు పలు దేశాల మధ్య యుద్ధాల వల్ల అన్ని దేశాలలో నిత్యావసర ధరలు ఎగిసిపడుతున్నాయి. వాస్తవానికి యుద్ధాలు మానవాళికి అపారమైన నష్టాన్ని మిగిల్చాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది సైనికులు, ప్రజలు మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అణు శక్తి, సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మరింత భయంకరమైన విధ్వంసం జరిగింది. దాదాపు ఎనిమిది కోట్ల మంది ప్రాణ నష్టం, లక్షల కోట్ల ధన నష్టం జరిగింది. దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. అయినా, ప్రపంచానికి శాశ్వత శాంతి లభించలేదు. లీగ్ ఆఫ్ నేషన్స్, ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి వంటి సంస్థలు ఏర్పడినా ప్రపంచంలో యుద్ధాలు ఆగలేదు. సామ్రాజ్యవాదం, ఆర్థిక ఆధిపత్యం, మతపరమైన విద్వేషాలు, పరోక్ష యుద్ధాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం కొరియా, వియత్నాం యుద్ధాలు కూడా లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నాయి. పాలస్తీనా--ఇజ్రాయెల్ ఘర్షణలు, ఉక్రెయిన్ యుద్ధం వంటి సంఘటనలు ప్రపంచాన్ని అశాంతి వైపు నెడుతున్నాయి. గతం నుంచి పాఠాలు నేర్చుకోవడంలో మానవజాతి విఫలమవుతోంది. కళింగ యుద్ధానంతరం పశ్చాత్తాపం చెందిన అశోకుడు.. ప్రజల సంక్షేమం, శాంతి, అభివృద్ధి కోసం కృషి చేశాడు. ప్రస్తుతం ప్రపంచంలో అలాంటి పరివర్తన ఎంతవరకు కనిపిస్తోంది?! వసుధైవ కుటుంబకంలో ప్రపంచమంతా ఒక కుటుంబమే. అయినప్పటికీ, ఆధిపత్య ధోరణులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులు, మతపరమైన ద్వేషాన్ని రెచ్చగొట్టే వర్గాలు యుద్ధానంతర సమాజ దుస్థితిని మరిచిపోతున్నాయి. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులు, అపారమైన ఆయుధ సంపత్తి శాంతిని తీసుకురాలేవు. అదే సంపదను పేదరికం, ఆకలి, వైద్యం, విద్య కోసం వినియోగిస్తే ప్రపంచం మరింత సంతోషంగా మారుతుంది. యెమెన్, సూడాన్, అఫ్ఘనిస్థాన్ వంటి దేశాల్లో ప్రజలు నేటికీ ఆకలి, నిరాశ్రయం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. మానవాళిపై దయ, ప్రేమ, సహానుభూతి పెరిగినప్పుడే సుస్థిర శాంతి సాధ్యమవుతుంది. శాంతి చర్చలు కేవలం రాజకీయ ప్రయోజనాలకే పరిమితం కాకుండా మానవ సంక్షేమానికి దారి తీయాలి. ప్రపంచ శాంతి స్థాపనలో భారతదేశం తన సాంస్కృతిక వారసత్వం, అహింసా సిద్ధాంతం, "వసుధైవ కుటుంబకం" భావనల ద్వారా మార్గదర్శకత్వం వహించాలి. మరోవైపు పశ్చిమాసియాలో ఇరాన్?తో చేస్తున్న యుద్ధం అమెరికాకు తీవ్ర ఆర్థిక భారంగా మారుతోంది. 2026 ఆగస్టు నాటికి అమెరికా రక్షణ శాఖ ఈ యుద్ధం కోసం సుమారు 38 బిలియన్? డాలర్లు (సుమారు రూ.3.65 లక్షల కోట్లు) మేర ఖర్చు చేసినట్లు కాంగ్రెషనల్? బడ్జెట్ ఆఫీస్? (సీబీఓ) తాజా నివేదికలో పేర్కొంది. ఒక వేళ యుద్ధం తీవ్రత జులై నాటి స్థాయికి పెరిగితే, అమెరికా నెలవారీ యుద్ధ ఖర్చు 3 బిలియన్? డాలర్లకు చేరే అవకాశం ఉందని హెచ్చరించింది.సీబీఓ అనేది అమెరికా కాంగ్రెస్?కు, బడ్జెట్?, ఆర్థిక విశ్లేషణలు అందించే ఒక నిష్పాక్షిక సంస్థ. ఇది తాజాగా "ఇరాన్?పై అమెరికా సైనిక చర్యల ఖర్చు అంచనా" అనే పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. అందులో ఇరాన్?తో యుద్ధానికి సంబంధించిన ఖర్చులను నాలుగు విభాగాలుగా చూపించింది. అవి ఏమిటంటే? రక్షణ శాఖ కార్యకలాపాలు, రవాణా, నిర్వహణ ఖర్చులు; ఆర్మ్కెట్? ఖర్చులు (ఒకదాని కోసం కేటాయించినవి మరొకదానికి వాడడం వల్ల కలిగే నష్టం); సరఫరా అంతరాయాలు, ధరల పెరుగుదల వల్ల కలిగే ఆర్థిక నష్టాలు; దౌత్యపరమైన చర్యలు, విదేశీ సాయం వంటి అదనపు ఖర్చులు. "అమెరికా రక్షణ శాఖ ఖర్చు చేసిన 38 బిలియన్ డాలర్లలో ఎక్కువ భాగం, యుద్ధంలో వాడేసిన మందుగుండు సామగ్రిని, నష్టపోయిన ఆయుధాలను మళ్లీ భర్తీ చేసుకోవడానికి ఖర్చు అయ్యింది. యుద్ధ విమానాల మోహరింపు, ఇంధనం ఖర్చు కూడా ఇందులో భాగంగా ఉంది. వాస్తవానికి యుద్ధం ప్రారంభమైన మొదట్లో ఘర్షణలు చాలా తీవ్రంగా జరిగాయి. ప్రస్తుతం తక్కువ తీవ్రతతో నామమాత్రంగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఒకవేళ మే, జూన్? నెలల తరహాలోనే మళ్లీ ఘర్షణలు తీవ్రమైతే, అమెరికా అదనంగా నెలకు 2 బిలియన్? డాలర్లు (సుమారు రూ.19.182 కోట్లు) ఖర్చు అయ్యే అవకాశం ఉంది. అదే ఈ ఘర్షణలు జులై నాటి తీవ్రతకు పెరిగితే ఆ ఖర్చు నెలకు 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.28,773 కోట్లు)కు చేరుతుంది. యుద్ధం తీవ్రత మరింత పెరిగితే ఆ ఖర్చులు ఇంకా పెరగవచ్చు. రక్షణ శాఖ మాకు అవసరమైన సమాచారాన్ని అందించకపోవడం వల్ల, ప్రభుత్వ డేటాబేస్లు, బహిరంగ నివేదికల ఆధారంగా ఈ అంచనాలు వేశాం" అని సీబీఓ పేర్కొంది. జూన్?లో ట్రంప్ ప్రభుత్వం 87.6 బిలియన్ డాలర్ల అదనపు నిధులు కోరింది.అందులో రక్షణ శాఖకు సంబంధించినవే 67.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో ఇరాన్?తో యుద్ధానికి కేటాయించినవి 42.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇది సీబీఓ అంచా వేసిన ఖర్చు కంటే 10 శాతం ఎక్కువ కావడం గమనార్హం.క్షిపణి రక్షణ వ్యవస్థల వాడకం భారీగా పెరగడం వల్ల అమెరికా వద్ద మిస్సైల్స్? నిల్వలు భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉందని సీబీఓ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా సైన్యానికి ఇది ఇబ్బందికర పరిణామమేనని స్పష్టం చేసింది. ఇరాన్? వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం వల్ల హర్మ్యూజ్? జలసంధి, ఎర్ర సముద్రం ద్వారా జరిగే చమురు, సహజవాయువు రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు, పెట్రోల్?, డీజిల్, జెట్ ఫ్యూయెల్? ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఇంధన ధరల పెరుగుదల వల్ల 2027 మొదటి త్రైమాసికంలో వినియోగ వస్తువుల ధరలు (పీసీఈ) ద్రవ్యోల్బణం మునుపటి అంచనాల కంటే 0.5 శాతం, కోర్ పీసీఈ ద్రవ్యోల్బణం 0.3 శాతం మేర పెరగవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రభావం అమెరికా ట్రెజరీ వడ్డీ రేట్లపై కూడా పడే అవకాశం ఉందని, 2026లో మూడు నెలల ట్రెజరీ బిల్లు రేట్లు 0.2 శాతం వరకు పెరగవచ్చని సీబీఓ అంచనా వేసింది. అయితే దౌత్యపరమైన చర్యలు, విదేశీ సహాయానికి అయ్యే అదనపు ఖర్చులను ఇప్పుడే కచ్చితంగా అంచనా వేయలేమని, అది యుద్ధ ముగింపుపై ఆధారపడి ఉంటుందని సీబీఓ పేర్కొంది. ఏదేమైనా ఈ యుద్ధాలు త్వరగా ముగిసిపోతే తప్ప ప్రజలకు కాస్త ఉపశమనం లభించదు. ఆ దిశగా ప్రపంచ దేశాలు చొరవ తీసుకొని యుద్ధాలు జరిగే దేశాల మధ్య సంధి కుదిర్చి మరింత ఆర్థిక సంకోభంలోకి వెళ్ళకుండా చూడాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

- **కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 : యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50-55 కోట్లకు చేరిందని తెలిపారు.

## సౌదీకి హౌతీల మరో భారీ షాక్..!

**అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత..!**



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 : పశ్చిమాసియాలో సౌదీ అరేబియా-హౌతీల పోరు మరింత తీవ్రమవుతోంది. యెమెన్ లో ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తున్న నేపథ్యంలో.. అక్కడ రెబెల్స్ గా ఉన్న హౌతీలు ఎదురుదాడులకు దిగుతున్నారు. ఇదే క్రమంలో ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్-మాండెబ్ ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా ప్రకటించారు. తాజాగా మరో అడుగు ముందుకేసి సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కాపై డ్రోన్లు ప్రయోగించారు. అయితే వీటిని సౌదీ సమర్ధంగా అడ్డుకుని మక్కాలో అలర్ట్ ప్రకటించింది. ఈ ఘటన చోటు చేసుకున్న కొద్ది గంటల్లోనే యెమెన్ గగనతలంపై ఎగురుతున్న సౌదీ ఎఫ్ 15 ఫైటర్ జెట్ ను కూల్చేసినట్లు హౌతీలు ప్రకటించారు. మిత్రదేశం అమెరికా నుంచి తీసుకుని వాడుతున్న ఎఫ్15 ఫైటర్ జెట్ ను హౌతీలు కూల్చేయడం తీవ్ర సంచలనం రేపుతోంది. నిన్న మొన్నటివరకూ హౌతీల్ని యెమెన్ లో ఇరాన్ మద్దతు కలిగిన చిన్న రెబెల్ గ్రూప్ గా పరిగణించిన వారికి ఇప్పుడు వారి సత్తా తెలుస్తోంది. ఇరాన్ ఇచ్చిన క్షిపణులు, డ్రోన్లతో సౌదీ మీద హౌతీలు చేస్తున్న యుద్ధం నిత్యం వార్తల్లో నిలుస్తోంది.యెమెన్‌లోని వివాదాస్పద మరిబ్ ప్రావిన్స్ గగనతలంలో సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమానాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు హౌతీ సైనిక దళాలు ప్రకటించాయి. తమ స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన ఉపరితలం నుండి గగనతలంలోకి దూసుకెళ్లే అత్యాధునిక క్షిపణి సహాయంతో ఈ విమానాన్ని నేలకూల్చినట్లు హౌతీ ప్రతినిధి యాహ్యా సారీ తెలిపారు. అయితే హౌతీల ఆరోపణలను సౌదీ అరేబియా ప్రభుత్వం ధృవీకరించలేదు. మక్కా నగరం తమకు అత్యంత పవిత్రమైనదని, దాని భద్రత విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తి లేదని సౌదీ సంకీర్ణ దళాలు హెచ్చరించాయి. కాగా తాము పవిత్ర ఇస్లామిక్ క్షేత్రాలకు ఎలాంటి హాని తలపెట్టలేదని హౌతీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

## పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

**కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం**

**51 లక్షల మంది లబ్ది పొందే చాన్స్**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 : దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరపున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పు లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

## జీరం ఘాటీ నరమేధం కేసులో మరణశిక్ష

- **10 మంది మావోయిస్టులకు శిక్ష విధిస్తూ చారిత్రక తీర్పు**

బస్తర్, సెప్టెంబర్ 16 : ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ 'పరివర్తన్ యాత్ర' కాన్వాయ్‌పై దాడి చేసిన మావోయిస్టులు 29 మందిని అతి దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ దాడి కేసులో జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన మొత్తం 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వం తుడుచుపెట్టుకుపోయింది. ఈ దారుణ నరమేధంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, నాటి పీసీసీ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మాసహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. దోషులపై భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఏ కోర్టు ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. భారత రాజకీయ భద్రతా చరిత్రలో చోటుచేసుకున్న అతిపెద్ద తీవ్రవాద దాడుల్లో ఒకటైన ఈ కేసులో 13 ఏళ్ల తర్వాత బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## షహజాద్ భట్టి నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం..

- **ఉగ్రసంస్థగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం**
- **పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఎస్‌బీఎన్**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 : పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను (ఎస్‌బీఎన్) కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) సెక్షన్ 35 కింద కేంద్ర హోంశాఖ బుధవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో షహజాద్ భట్టి నెట్‌వర్క్ సంస్థతో పాటు దాని సభ్యులపై ఉగ్రవాద నిధులు (టెర్రర్ ఫైనాన్సింగ్), కుట్ర వంటి తీవ్రమైన అభియోగాల కింద కేసులు నమోదు చేసేందుకు దర్యాప్తు సంస్థలకు మార్గం సుగమమైంది. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అందులో భాగంగానే ఈ కఠిన చర్యలు తీసుకున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ సంస్థ సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తూ, యువతను, చిన్నచిన్న నేరస్థులను ఉగ్రవాదం వైపు ప్రేరేపిస్తోందని ఆయన పేర్కొన్నారు. విద్వేషపూరిత డిజిటల్ కంటెంట్‌తో దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు, మత సామరస్యానికి ఈ సంస్థ విఘాతం కలిగిస్తోందని హోంశాఖ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ మద్దతుతో నడుస్తున్న సిండికేట్‌గా అధికారులు ఎస్‌బీఎన్‌ను అభివర్ణిస్తున్నారు. గ్రెనేడ్లు, ఐఈడీ దాడులు, లక్షిత హత్యలు, పోలీసు, రక్షణ, మతపరమైన ప్రదేశాలపై నిఘా వంటి అసాంఘిక కార్యకలాపాల్లో ఈ సంస్థకు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని అధినేత షహజాద్ భట్టి దుబాయ్, పాకిస్థాన్‌ల నుంచి తన కార్యకలాపాలను నిర్వహిస్తుంటాడు. 2025 మార్చిలో పంజాబ్‌లోని జలంధర్‌లో యూట్యూబర్ రోజర్ సంధు నివాసంపై జరిగిన గ్రెనేడ్ దాడి, 2024 నవంబర్‌లో నటుడు మిథున్ చక్రవర్తికి అందిన బెదిరింపుల వెనుక భట్టి హస్తం ఉన్నట్లు ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవానికి కొన్ని వారాల ముందు భద్రతా ఏజెన్సీలు దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో దాడులు నిర్వహించి ఎస్‌బీఎన్‌తో సంబంధం ఉన్న 253 మందిని అదుపులోకి తీసుకున్నాయి. వారి నుంచి భారీగా పేలుడు పదార్థాలు, తుపాకులు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులు ఉన్న గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టులు, పలు కేసుల్లో వెల్లడైన ఆధారాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎస్‌బీఎన్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

# పోషణ మాసాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

**-అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు ప్రతి నెలా నమోదు చేయాలి**

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో పోషణ మాసాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించనున్న 9వ జాతీయ పోషణ మాసంపై జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశాన్ని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ మాసం పోస్టర్‌ను కలెక్టర్, అధికారులు కలిసి ఆవిష్కరించారు.జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం పోషణ మాసం షెడ్యూల్, కార్యాచరణ ప్రణాళికను వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ 'మన అంగన్వాడీ.. మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు, ఆర్వో వాటర్‌తో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువును ప్రతి నెలా తప్పనిసరిగా కొలిచి, వివరాలను అంగన్వాడీ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సామ్, మామ్, ఎస్‌యూడబ్ల్యూ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంగన్వాడీ సూపర్‌వైజర్లు వారి ఇళ్లకు వెళ్లి పోషకాహారం, సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు . బాలామృతం, బాలామృతం ప్లస్ ఆహార పదార్థాలను అందించడంతో పాటు ఎదుగుదలలో లోపాలు, ఇతర సమస్యలు ఉన్న పిల్లలను డీఈఐసీ కేంద్రాలకు తరలించాలని సూచించారు.పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి అదనపు పోషకాహారం అందించాలని, వైద్యశాఖ సిబ్బంది సమన్వయంతో వైద్య పరీక్షలు నిర్వహించి వారు సాధారణ స్థితికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వేడివేడిగా అందించాలని సూచించారు.ఈ నెల 21న అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనేలా చూడాలని తెలిపారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లు తమ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. కేంద్రాల లోపల, బయట పరిశుభ్రతను పర్యవేక్షించి అవసరమైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, డీపీఓ అఫ్జల్ బేగం, డీసీఎస్ఓ డీఎం గోపాల్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



# వినాయక నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలి..

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పక్కాగా చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలోని ప్రేమ్ నగర్, బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె పలు శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. వినాయక నిమజ్జనానికి కావలసిన నీటి సౌకర్యం, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ అధికారులు సేవలు అందించాలని, పారిశుధ్య పనులు చేయించాలని, క్రేన్లు అందుబాటులో పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఇక్కడ మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రాచారి, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ప్రదేశాలను పరిశీలించిన సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని మానేరు నది తీరంలో బ్రిడ్జి వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన ప్రదేశాలను సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్ బాబుతో కలిసి సంబంధిత అధికారులతో పరిశీలించారు.

ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కల్పించాల్సిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ప్రాంతంలో అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు.

ఈ పరిశీలనలో సిరిసిల్ల టౌన్ సీఐ శ్రీనివాస్, రూరల్ సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ అశోక్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# మానేరు కరకట్ట పనులు త్వరితగతిన పూర్తి చేయాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మానేరు నది వద్ద కరకట్ట పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మానేరు తీరంలో తంగళ్లపల్లి బ్రిడ్జి నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల మేర కరకట్ట పనులు కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, నీటి పారుదల శాఖ, మున్సిపల్ అధికారులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .. నీటి పారుదల శాఖ అధికారులు కరకట్ట పనులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని, త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. పరిశీలనలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో ప్రత్యేక ఆకర్షణగా అనంత పద్మనాభ గణేశుడు..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని బి.వై. నగర్ లో ఛత్రసేన యూత్ ఆధ్వర్యంలో వినూత్న రూపంలో గణేష్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఛత్రసేన యూత్ 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని యూత్ అధ్యక్షుడు అల్లే శ్రీనివాస్, దార్ల సందీప్‌ల నేతృత్వంలో అనంత పద్మనాభస్వామి ఆకారంలో గణనాథుడిని ఏర్పాటు చేశారు.

ఈ విగ్రహానికి సిరిసిల్ల పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ దాతగా నిలిచారు. గణనాథుడిని దశావతారాల రూపాలతో ప్రత్యేకంగా అలంకరించడం విశేష ఆకర్షణగా నిలిచింది. వినూత్న రూపంలో కొలువుదీరిన గణేశుడిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తిగా తరలివస్తున్నారు. ఆధ్యాత్మికత, కళాత్మకత కలగలిపిన ఈ గణేష్ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





# ముదిరాజ్ సంఘం మండ అధ్యక్షుడిగా పెరుమాండ్ల అంజయ్య

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండల ముదిరాజ్ సంఘం నూతన మండల అధ్యక్షుడి ఎన్నికలు ఉత్కంఠభరితంగా నిర్వహించారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ ఎన్నికల్లో దుమల గ్రామానికి చెందిన పెరుమాండ్ల అంజయ్య మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా విజయం సాధించారు. ఫలితాలు వెలువడిన అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు, వివిధ గ్రామాల అధ్యక్షులు, సభ్యులు అంజయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

**సంఘం ఐక్యతకు ప్రాధాన్యం**

మండల స్థాయిలో ముదిరాజ్ సంఘాన్ని మరింత బలోపేతం చేయడం, గ్రామాల వారీగా సంఘాన్ని సమన్వయం చేయడం, సభ్యుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై నూతన అధ్యక్షుడిపై బాధ్యత పెరిగింది.

ఎన్నికల సందర్భంగా పలు గ్రామాల అధ్యక్షులు, సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దుమల పెరుమాండ్ల అంజయ్యకు నాయకులు అభినందనలు తెలియజేస్తూ, మండలంలోని ముదిరాజ్ సమాజాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

మండల అధ్యక్షుడిగా ఎన్నికైన అంజయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన గ్రామాల అధ్యక్షులు, సంఘ నాయకులు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని, సభ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు..




**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల మండలంలోని భవిత సెంటర్‌లో బుధవారం దివ్యాంగ విద్యార్థిని, విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రాథమిక స్థాయి, సెకండరీ స్థాయిల్లో విద్యార్థులకు వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు.

ఈ పోటీల్లో పరుగు పందెం, మ్యూజికల్ చైర్, బాస్కెట్‌బాల్, కవర్ రింగ్, డ్రాయింగ్, షాట్‌పుట్ తదితర విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి దూస రఘుపతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల మండల విద్యాధికారి దూస రఘుపతి, IERP పత్తిపాక సునీత, సుందరయ్య నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. లక్ష్మి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఇప్పపూల దేవేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ NSPC–2026లో MPHS పెద్దూర్ పాఠశాల ఘన విజయం..

**- జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం.. రాష్ట్ర స్థాయిలో 21వ ర్యాంక్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

జాతీయ స్థాయి విద్యార్థుల పర్యావరణ పోటీ National Student Paryavaran Competition (NSPC)–2026లో రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూర్‌లోని MPHS పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, పర్యావరణహిత చర్యల్లో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ పోటీలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2,098 మంది పాల్గొనేవారితో MPHS పెద్దూర్ పాఠశాల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది.

అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో 21వ స్థానాన్ని సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. దేశవ్యాప్తంగా ఈ పోటీలో 18,01,792 మంది పాల్గొన్నట్లు పోటీ డ్యాష్‌బోర్డ్‌లో నమోదైంది.

ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా DSO పాముల దేవయ్య MPHS పెద్దూర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యానికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావడంలో పాఠశాల చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

ఈ విజయానికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయ బృందం గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, జంగం రాజమల్లు, ఈరబోయిన రవికుమార్, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్ తదితరులను పలువురు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణను ప్రతి విద్యార్థి తన బాధ్యతగా భావించి, భవిష్యత్తులో కూడా పర్యావరణహిత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.







# సిరిసిల్లలో శ్రీ వెంకటేశ్వర స్వామి రూపం-లో గణనాథుడు..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలో హిందూ ప్రిన్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినూత్న గణేష్ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈసారి శ్రీ వెంకటేశ్వర స్వామి రూపాన్ని పోలిన ప్రత్యేక ఆకృతిలో గణనాథుడిని ప్రతిష్ఠించారు.

విగ్రహాన్ని ఆలయ వాతావరణాన్ని తలపించేలా ప్రత్యేకంగా రూపొందించిన గుడి సెట్‌లతో అందంగా అలంకరించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి రూపంలో దర్శనమిస్తున్న గణనాథుడిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రత్యేక అలంకరణలు, ఆకట్టుకునే రూపకల్పనతో ఈ గణేష్ మండపం భక్తుల దృష్టిని ఆకర్షిస్తోంది.

హిందూ ప్రిన్స్ యూత్ సభ్యులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గణనాథుడి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తోందని నిర్వాహకులు తెలిపారు.





# మక్కా సమీపంలో దాడిపై భారత్ తీవ్ర ఆందోళన

## సౌదీ సార్వభౌమత్వంపై దాడులను ఖండించిన భారత్

## పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించాలి: రణ్‌ధీర్ జైస్వాల్

న్యూఢిల్లీ

మక్కా సమీపంలో జరిగిన డ్రోన్ దాడిపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సౌదీ అరేబియా సార్వభౌమ భూభాగంపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన మక్కా నగరంపై దాడికి యత్నించడం మరింత ఆందోళనకరమని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాన్ని త్వరగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు.

మక్కా నగరానికి దక్షిణంగా హూతీలు ప్రయోగించిన డ్రోన్‌ను సౌదీ వాయు రక్షణ వ్యవస్థలు అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సౌదీ అధికారులు తెలిపారు. మక్కా నిషేధిత గగనతలంలోకి ప్రవేశించకముందే డ్రోన్‌ను కూల్చివేసినట్లు వెల్లడించారు. అయితే మక్కా లేదా ఇతర ఇస్లామిక్ పవిత్ర స్థలాలను తాము లక్ష్యంగా చేసుకోలేదని హూతీలు పేర్కొన్నారు.

సౌదీ అరేబియాపై జరుగుతున్న దాడులు ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీయడంతో పాటు బాబ్-ఎల్-మండేబ్ జలసంధి ద్వారా నౌకాయాన స్వేచ్ఛకు ముప్పు కలిగించే అవకాశం ఉందని జైస్వాల్ తెలిపారు. ఎర్ర సముద్రాన్ని ఏడెన్ గల్ఫ్, అరేబియా సముద్రంతో కలిపే ఈ జలసంధి అంతర్జాతీయ వాణిజ్యం, చమురు రవాణాకు కీలకమైన సముద్ర మార్గంగా ఉంది.

ఇదిలా ఉండగా, బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సౌదీ విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్‌తో సమావేశమై పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై చర్చించారు. సౌదీ సార్వభౌమ భూభాగం, పౌర మౌలిక సదుపాయాలు, ఆర్థిక ఆస్తులపై జరుగుతున్న దాడులను భారత్ ఖండించినట్లు జైస్వాల్ తెలిపారు. వాణిజ్య నౌకలు, పౌర మౌలిక సదుపాయాలపై దాడులు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.

# మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా దేశాల జాబితాను విడుదల చేసిన అమెరికా

## భారత్, చైనా సహా 23 దేశాలను చేర్చిన ట్రంప్ ప్రభుత్వం; మోదీ యత్నాలను శ్లాఘించిన యూఎస్ అధ్యక్షుడు

ప్రపంచవ్యాప్తంగా అక్రమ మాదక ద్రవ్యాల (డ్రగ్స్) ఉత్పత్తి, రవాణాకు కేంద్రాలుగా ఉన్న 23 కీలక దేశాల జాబితాను అమెరికా విడుదల చేసింది. ఈ జాబితాలో భారత్, చైనా, పాకిస్థాన్‌ల పేర్లను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేర్చారు. అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించిన ప్రెసిడెన్షియల్ డిటర్మినేషన్‌లో ఈ వివరాలను వెల్లడిస్తూ, ఈ సమస్య నివారణకు ఆయా దేశాల నాయకులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

**భౌగోళిక, ఆర్థిక కారణాలే ప్రాతిపదిక: అమెరికా**

ఈ జాబితాలో ఒక దేశం పేరు ఉన్నంత మాత్రాన, ఆ దేశ ప్రభుత్వం మాదకద్రవ్యాల నిరోధానికి చర్యలు తీసుకోవడం లేదని గానీ, అమెరికాతో సహకరించడం లేదని గానీ అర్థం కాదని ట్రంప్ స్పష్టం చేశారు. సదరు దేశాల్లోని భౌగోళిక, వాణిజ్య, ఆర్థిక పరిస్థితుల కారణంగానే మాదకద్రవ్యాలు లేదా వాటి తయారీకి వాడే రసాయనాల రవాణా జరుగుతోందని వివరించారు. ఎంత కఠినమైన చట్టాలు అమలు చేసినప్పటికీ ఈ భౌగోళిక పరిస్థితుల వల్ల జాబితాలో చేర్చాల్సి వచ్చిందని తెలిపారు.

**భారత్ ప్రయత్నాలపై ప్రధాని మోదీకి అభినందనలు**

అక్రమ నల్లమందు (ఓపియం) సాగు నివారణకు, సరఫరా వ్యవస్థలో పారదర్శకతకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యేకంగా శ్లాఘించారు. "యునైటెడ్ స్టేట్స్ - ఇండియా డ్రగ్ పాలసీ ఫ్రేమ్‌వర్క్" ద్వారా భారత్‌తో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఈ 23 దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, కొలంబియా, మెక్సికో, వెనిజులా, బహామాస్, బొలీవియా, మైన్మార్, జమైకా తదితర దేశాలు కూడా ఉన్నాయి.

# యుకేలో హిందూ-ముస్లిం దంపతులకు నష్టపరిహారం

## వేర్వేరుగా నిర్బంధించడంపై లండన్ హైకోర్టు సంచలన తీర్పు

## డిపోర్టేషన్ క్రమంలో దంపతుల హక్కులను కాలరాసిన హోమ్ ఆఫీస్..

## బ్రిటన్ ప్రభుత్వానికి లండన్ కోర్టు మొట్టికాయలు

బలగం టీవీ, హైదరాబాద్

అంతర్మత వివాహం చేసుకున్నారనే కారణంతో భారత్‌కు డిపోర్ట్ (దేశ బహిష్కరణ) చేసే క్రమంలో ఒక భారతీయ దంపతులను వేర్వేరుగా డిటెన్షన్ సెంటర్లలో ఉంచడంపై లండన్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్య వారి ప్రాథమిక కుటుంబ జీవిత హక్కులను ఉల్లంఘించడమేనని స్పష్టం చేస్తూ, బాధితులైన హిందూ-ముస్లిం దంపతులకు యుకే హోమ్ ఆఫీస్ నుంచి నష్టపరిహారం పొందే హక్కు ఉందని న్యాయమూర్తి సైమన్ టింక్లర్ మంగళవారం తీర్పునిచ్చారు.

కుటుంబ హక్కుల ఉల్లంఘనే: లండన్ హైకోర్టు

యూరోపియన్ కన్వెన్షన్ ఆన్ హ్యూమన్ రైట్స్ (EHCR) ఆర్టికల్ 8 ప్రకారం ప్రతి ఒక్కరికీ కుటుంబ జీవితాన్ని గడిపే హక్కు ఉందో అని న్యాయమూర్తి గుర్తుచేశారు. వివాహిత దంపతులైన వీరిని ఇమ్మిగ్రేషన్ డిటెన్షన్ సెంటర్లలో పురుషులు, మహిళల విభాగాలు అంటూ వేర్వేరుగా ఉంచడం చట్టవిరుద్ధమైన జోక్యమేనని కోర్టు తేల్చిచెప్పింది. వారు ఆశ్రయం (అసైలమ్) కోసం చేసుకున్న పిటిషన్‌ను తిరస్కరించినప్పటికీ, వారిని విడదీయడం హోమ్ ఆఫీస్ చేసిన తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనేనని న్యాయమూర్తి స్పష్టం చేశారు. బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహారం తీవ్రతను లెక్కించే బాధ్యతను కౌంటీ కోర్టుకు బదిలీ చేశారు.

అసలేం జరిగింది?

బాధితులలో భార్య (FNB) 2022లో స్టూడెంట్ వీసాపై బ్రిటన్‌కు వెళ్లగా, ఆమె భర్త (FNN) డిపెండెంట్‌గా అక్కడికి చేరుకున్నారు. తమది అంతర్మత వివాహం కావడంతో భారత్‌లో వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తుందని భావించి వారు బ్రిటన్‌లో ఆశ్రయం కోరారు. అయితే, వారి విజ్ఞప్తిని బ్రిటన్ హోమ్ ఆఫీస్ గతేడాది ఆగస్టులో తిరస్కరించి, సెప్టెంబర్ 11న ఇద్దరినీ నిర్బంధంలోకి తీసుకుంది. వారిని భారత్‌కు పంపించే వరకు డిటెన్షన్ సెంటర్లోని వేర్వేరు విభాగాల్లో ఉంచింది. దీనిపై దంపతులు లండన్ హైకోర్టును ఆశ్రయించగా, ఈ నిర్ణయం చట్టవిరుద్ధమని తీర్పు వెలువడింది. దంపతులను ఇలా వేరుగా ఉంచే కేసులన్నింటినీ అత్యవసరంగా సమీక్షించాలని లండన్ హైకోర్టు హోమ్ ఆఫీస్‌ను ఆదేశించింది.

# నేపాల్‌లో బస్సు బోల్తా..

## 12 మంది భారతీయులకు గాయాలు

బలగం టీవీ, హైదరాబాద్

నేపాల్‌లోని ప్రముఖ ముక్తినాథ్ ఆలయ సమీపంలో బుధవారం జరిగిన బస్సు ప్రమాదంలో 12 మంది భారతీయులు గాయపడ్డారు. ముక్తినాథ్ ఆలయం నుంచి అప్పర్ ముస్తాంగ్ వైపు వెళ్తుండగా జోంసోమ్–ముక్తినాథ్ మార్గంలోని కాగ్‌బెనీ సమీపంలో మినీబస్సు అదుపుతప్పి బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు.

బస్సులో మొత్తం 25 మంది ప్రయాణికులు ఉండగా, వారిలో 13 మందికి ఎలాంటి గాయాలు కాలేదు. గాయపడిన వారిలో ఢిల్లీకి చెందిన 68 ఏళ్ల వేద్‌పాల్ శర్మతో పాటు ఎక్కువ మంది వృద్ధులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. క్షతగాత్రులను జోంసోమ్‌లోని ప్రావిన్షియల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రమాదానికి సంబంధించి నేపాలీ బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఏఐ అభివృద్ధి వేగంపై జుకర్‌బర్గ్ సంచలన వ్యాఖ్యలు

## టెక్ దిగ్గజాల సమన్వయ నిరోధ ప్రతిపాదనను తోసిపుచ్చిన మెటా అధినేత

బలగం టీవీ, హైదరాబాద్

కృత్రిమ మేధ (ఏఐ) అభివృద్ధిని నెమ్మదింపజేయాలన్న ప్రతిపాదనలపై మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఐ సాంకేతికత సురక్షితంగా ఉందో లేదో చూసుకోవాల్సిన బాధ్యత పూర్తిగా ఆయా సంస్థలదేనని, పోటీ సంస్థలు కోరుతున్నట్లు పరిశ్రమ అంతా కలిసి ఏఐ అభివృద్ధి వేగాన్ని తగ్గించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

సమన్వయ నిరోధానికి జుకర్‌బర్గ్ విముఖత

యాంత్రిక మేధ (ఏఐ) వల్ల మానవాళికి ముప్పు వాటిల్లుతుందన్న ఆందోళనల నేపథ్యంలో, ఏఐ అభివృద్ధిని కొంతకాలం మందగించాలని ఆంత్రోపిక్ సంస్థ సీఈఓ డారియో అమోడీ మూడు దశల ప్రణాళికను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్, ఎలాన్ మస్క్ వంటి ప్రముఖులు మద్దతు పలికారు. అయితే, ఈ పిలుపును జుకర్‌బర్గ్ తోసిపుచ్చారు. సంస్థలు తమ మోడళ్లను సురక్షితంగా రూపొందించడానికి తగిన ప్రేరణ, చట్టపరమైన జవాబుదారీతనం ఇప్పటికే ఉన్నాయని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

'మ్యూజ్ ఏఐ' ఉదాహరణతో మెటా స్పష్టత

తమ సంస్థ అభివృద్ధి చేసిన 'మ్యూజ్' (Muse) ఏఐ ఏజెంట్ భద్రత, రక్షణ ప్రమాణాలను నిర్ధారించుకోవడానికి దాని విడుదలను కొన్ని నెలల పాటు వాయిదా వేశామని జుకర్‌బర్గ్ గుర్తుచేశారు. "మా మోడల్ భద్రత కోసం మేం ఆగినా, మిగిలిన వారందరినీ ఆగాలని మేం కోరలేదు" అని పరోక్షంగా వ్యాఖ్యానించారు. స్వయం సమృద్ధి ఆధారిత ఏఐ (రైకర్సివ్ సెల్ఫ్-ఇంప్రూవ్‌మెంట్) పోటీలో పడకుండా, అందుబాటులో ఉన్న కంప్యూటింగ్ శక్తినంతటినీ ప్రజలకు సురక్షితమైన సేవలు అందించేందుకు ఉపయోగించడమే సరైన మార్గమని ఆయన సూచించారు.

# మక్కా సమీపంలో హూతీల డ్రోన్ కూల్చివేత

## పశ్చిమాసియాలో ముదిరిన ఉద్రిక్తతలు: పవిత్ర నగరాలు, యాత్రికుల భద్రతపై రాజీపడేది లేదు: సౌదీ అరేబియా కఠిన హెచ్చరిక

బలగం టీవీ, హైదరాబాద్



పశ్చిమాసియాలో రోజురోజుకూ యుద్ధ వాతావరణం ముదురుతున్న వేళ సౌదీ అరేబియా తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసే అంశాన్ని వెల్లడించింది. యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన ఒక డ్రోన్ ఇస్లాం పవిత్ర నగరం మక్కా సమీపానికి దూసుకొచ్చిందని, సౌదీ వైమానిక రక్షణ వ్యవస్థలు దానిని సకాలంలో గుర్తించి కూల్చివేశాయని ప్రకటించింది. నిషేధిత గగనతలంలోకి ప్రవేశించకముందే ఆ డ్రోన్‌ను ధ్వంసం చేసినట్లు సౌదీ రాయల్ ఎయిర్ డిఫెన్స్ బలగాలు తెలిపాయి. ఈ ఘటన నేపథ్యంలో మక్కాతో పాటు జెద్దా, తైఫ్ నగరాల్లో సౌదీ సివిల్ డిఫెన్స్ 'ఏరియల్ థ్రెట్ అలర్ట్' జారీ చేసింది. మక్కా చరిత్రలోనే ఇలాంటి హెచ్చరిక జారీ చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

**హూతీల ఉగ్ర చర్యలను ఉపేక్షించం: సౌదీ కూటమి**

మక్కాలోని పవిత్ర మసీదులు, అక్కడకు వచ్చే లక్షలాది మంది యాత్రికులు, పౌరుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని సౌదీ కూటమి అధికార ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్-మాల్కీ స్పష్టం చేశారు. మక్కాను లక్ష్యంగా చేసుకోవడం భయాందోళనలు సృష్టించేందుకు పూనుకున్న శత్రుత్వ, ఉగ్రవాద చర్య అని ఆయన అభివర్ణించారు. అవసరమైతే హూతీలపై అత్యంత తీవ్రమైన నిరోధక చర్యలు తీసుకునేందుకు సంకీర్ణ దళాలు వెనుకాడబోవని హెచ్చరించారు. 2017 జులై తర్వాత మక్కాను లక్ష్యంగా చేసుకుని దాడికి యత్నించడం ఇది రెండోసారి. ఈ ఘటనను ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (OIC) తీవ్రంగా ఖండించింది.

**సౌదీ ఆరోపణలను తోసిపుచ్చిన హూతీలు**

మరోవైపు సౌదీ అరేబియా చేస్తున్న ఆరోపణలను యెమెన్ హూతీ వర్గాలు తీవ్రంగా ఖండించాయి. గడిచిన 24 గంటల్లో సౌదీ యుద్ధ విమానాలు ఎఫ్-15, టైఫూన్లతో యెమెన్‌లోని పాఠశాలలు, రహదారులు, ఇతర పౌర మౌలిక సదుపాయాలపై 52 వైమానిక దాడులకు తెగబడ్డాయని హూతీ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యహ్యా సరీ ఆరోపించారు. కాగా, ఎర్ర సముద్రంలో కీలకమైన బాబ్ అల్-మండెబ్ జలసంధి పరిసరాల్లో ఉద్రిక్తతలు పెరగడంతో పాటు, ముందస్తు జాగ్రత్త చర్యగా మదీనా అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలను నిలిపివేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

# ఇజ్రాయెల్‌కు 40 వేల భారీ బాంబులు..



## రూ.2.8 బిలియన్ ఒప్పందం

## 2,000 పౌండ్ల బాంబుల సరఫరాకు ట్రంప్ ప్రభుత్వం సన్నాహాలు

బలగం టీవీ, హైదరాబాద్

ఇజ్రాయెల్‌కు 40 వేల భారీ బాంబులను సరఫరా చేసేందుకు అమెరికా ప్రభుత్వం రూ.2.8 బిలియన్ డాలర్ల ఆయుధ ఒప్పందాన్ని సిద్ధం చేస్తోంది. ఈ ప్యాకేజీలో 2,000 పౌండ్ల బరువున్న 20 వేల ఎంకే-84, 20 వేల బీఎల్‌యూ-117 బాంబులు ఉన్నట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. ఈ ఒప్పందంపై అమెరికా కాంగ్రెస్‌కు అనధికారికంగా సమాచారం అందించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది.గాజాలో భారీగా పౌర ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందన్న ఆందోళనలతో ఇదే తరహా బాంబుల సరఫరాను 2024లో అప్పటి బైడెన్ ప్రభుత్వం నిలిపివేసింది. అయితే డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ ఆంక్షలను ఎత్తివేశారు. తాజా ఒప్పందంలో ఎక్కువ భాగం విదేశీ సైనిక ఆర్థిక సహాయం ద్వారా నిధులు సమకూరనున్నాయి. అంటే అమెరికా ప్రభుత్వం అందించే నిధులతో ఇజ్రాయెల్ అమెరికా నుంచే ఆయుధాలను కొనుగోలు చేయనుంది.

గాజా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదిత ఆయుధ ఒప్పందం తెరపైకి వచ్చింది. 2,000 పౌండ్ల బాంబుల్లో కొన్ని భూగర్భంలోని బలమైన లక్ష్యాలను ఛేదించేందుకు, మరికొన్ని భూమిపై భారీ విధ్వంసం కలిగించేలా రూపొందించబడ్డాయి. గాజాలో ఇలాంటి అమెరికా తయారీ బాంబులను ఉపయోగించినట్లు దాడుల దృశ్యాలు, పేలుడు అవశేషాలను విశ్లేషించిన నిపుణులు పేర్కొన్నట్లు ఏపీ తెలిపింది.

గతేడాది ట్రంప్ ప్రభుత్వం సాధారణ కాంగ్రెస్ సమీక్ష ప్రక్రియను పక్కనపెట్టి దాదాపు 3 బిలియన్ డాలర్ల విలువైన ఇజ్రాయెల్ ఆయుధ విక్రయానికి ఆమోదం తెలిపింది. అందులో 35,500కు పైగా ఇదే తరహా బాంబులు ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో మరో 6.67 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ విక్రయాలకు కూడా అమెరికా ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

# దక్షిణాఫ్రికా అధికారులపై అమెరికా కొత్త ఆంక్షలు

## తెల్లజాతీయులపై వివక్ష ఆరోపణలతో ట్రావెల్ బాన్ విధించిన ట్రంప్ ప్రభుత్వం

బలగం టీవీ, హైదరాబాద్

దక్షిణాఫ్రికాలో తెల్లజాతీయులు, ఇతర మైనారిటీ వర్గాలపై వివక్ష చూపుతున్నారనే ఆరోపణలతో ఆ దేశ అధికారులపై అమెరికా తీవ్ర ఆంక్షలు విధించింది. దక్షిణాఫ్రికాకు చెందిన పలువురు ప్రభుత్వ అధికారులపై ప్రయాణ నిషేధం (ట్రావెల్ బాన్) విధిస్తున్నట్లు డోనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని అమెరికా పరిపాలన వర్గం ప్రకటించింది. నష్టపరిహారం ఇవ్వకుండా భూముల సేకరణ, జాతి ఆధారిత వివక్షను ప్రోత్సహించడం, మైనారిటీలపై హింసను రెచ్చగొట్టేలా చట్టాలను అమలు చేస్తున్న అధికారుల వీసాలను రద్దు చేయడంతో పాటు కొత్త వీసాల దరఖాస్తులను తిరస్కరించనున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు.




**అమెరికా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన దక్షిణాఫ్రికా**

అమెరికా చేసిన ఆరోపణలను దక్షిణాఫ్రికా ప్రభుత్వం తీవ్రంగా తోసిపుచ్చింది. ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని, తప్పుడు సమాచారం ఆధారంగానే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని స్పష్టం చేసింది. గతంలో వర్ణవివక్ష (అపార్థీడ్) కాలంలో నల్లజాతీయులకు జరిగిన అన్యాయాలను సరిదిద్దేందుకే దేశీయంగా భూసేకరణ, అఫర్మేటివ్ యాక్షన్ వంటి చట్టాలను తీసుకువచ్చామని దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి రోనాల్డ్ లామోలా పేర్కొన్నారు. ఒకరి సార్వభౌమాధికారాన్ని మరొకరు గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అమెరికాకు స్పష్టం చేశారు.

**ఇరు దేశాల మధ్య పెరుగుతున్న దౌత్య ఉద్రిక్తతలు**

దక్షిణాఫ్రికాలో సుమారు 6.2 కోట్ల జనాభా ఉండగా, అందులో దాదాపు 45 లక్షల మంది తెల్లజాతీయులు ఉన్నారు. భూసేకరణ చట్టాలు, తెల్లజాతీయులైన రైతులపై జరుగుతున్న కొన్ని నేరాలను అమెరికా కారణంగా చూపుతోంది. దీనికి తోడు గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను 'జెనోసైడ్' (ఇంటియ దారణం)గా అభివర్ణిస్తూ అంతర్జాతీయ న్యాయస్థానంలో దక్షిణాఫ్రికా కేసు వేయడం కూడా ట్రంప్ ప్రభుత్వానికి తీవ్ర ఆగ్రహం కలిగించింది. ఈ నేపథ్యంలోనే జీ-20 సమావేశాలకు దక్షిణాఫ్రికా అధికారులను నిషేధించడం, హెచ్ఐవీ నిధుల కోత విధింపు వంటి వరుస ఆంక్షల పరంపరలో భాగంగా అమెరికా ఈ కొత్త వీసా ఆంక్షలను ప్రకటించింది.

# భారత విద్యుత్ శాఖ మంత్రి, యూఎస్ ఇంధన కార్యదర్శి భేటీ

## అణు విద్యుత్ విస్తరణ, క్లీన్ ఎనర్జీ భాగస్వామ్యంపై హ్యూస్టన్‌లో ఇరు దేశాల మంత్రుల సుదీర్ఘ చర్చలు

బలగం టీవీ, హైదరాబాద్

భారత కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్, అమెరికా ఇంధన కార్యదర్శి క్రిస్ రైట్‌తో హ్యూస్టన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హ్యూస్టన్ వేదికగా జరిగిన జీ-20 ఇంధన సమృద్ధి మంత్రివర్గ సదస్సు (G20 Energy Abundance Ministerial) సందర్భంగా మంగళవారం ఈ భేటీ జరిగింది. భారత్‌లో వేగంగా పెరుగుతున్న అణు విద్యుత్ రంగా విస్తరణ ప్రణాళికలు (రోడ్‌మాప్), విద్యుత్ రంగాభివృద్ధికి ఇరు దేశాల మధ్య ఉన్న భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

ఏఐ, డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలపై దృష్టి

కృత్రిమ మేధ (AI), హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ మరియు భారీ డేటా సెంటర్ల స్థాపన వల్ల భారత్‌లో భవిష్యత్తులో ఏర్పడే భారీ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఇద్దరు నాయకులు అభిప్రాయాలను పంచుకున్నారు. వీటితో పాటు స్వచ్ఛమైన ఇంధనం (క్లీన్ ఎనర్జీ), పునరుత్పాదక శక్తి మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల మార్పిడిలో పరస్పరం సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ లక్ష్యం

స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల వేళ 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో భారత అణు రంగంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా పరిశ్రమలు తీవ్ర ఆసక్తి చూపుతున్నాయి. గతేడాది భారత ప్రభుత్వం 'శాంతి చట్టం'



(SHANTI Act) ద్వారా అణు రంగాన్ని ప్రైవేటు భాగస్వామ్యానికి తలుపులు బార్లా తెరిచిన సంగతి తెలిసిందే. మరోవైపు, పశ్చిమాసియాలో ముదిరిన ఉద్రిక్తతల కారణంగా పాత సరఫరాదారుల నుంచి అంతరాయాలు ఏర్పడటంతో అమెరికా నుంచి ఎల్‌పీజీ (LPG), ఎల్ఎన్‌జీ (LNG) దిగుమతులను భారత్ గణనీయంగా పెంచినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

# గాజాలో భవనం కూలి 21 మంది మృతి

బలగం టీవీ, హైదరాబాద్

పశ్చిమాసియాలో రోజురోజుకూ ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ వివిధ ప్రాంతాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. గాజా సిటీలో బాంబు దాడికి గురై శిథిలావస్థకు చేరిన ఒక భవనం ఉన్నపళంగా కూలిపోవడంతో 11 మంది పిల్లలు సహా కనీసం 21 మంది నిర్వాసితులు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు సౌదీ అరేబియాలోని పవిత్ర నగరం మక్కా సమీపానికి దూసుకొచ్చిన ఒక డ్రోన్‌ను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకుని కూల్చివేసినట్లు ఆ దేశ సైన్యం ప్రకటించింది.

శిథిలాల కింద ఆక్రందనలు.. చేతులతోనే తవ్వుతున్న బాధితులు

గాజా సిటీలోని తల్ అల్-హవా ప్రాంతంలో గతంలో ఇజ్రాయెల్ వైమానిక దాడిలో తీవ్రంగా దెబ్బతిన్న ఏడంతస్తుల భవనం బుధవారం రాత్రి అకస్మాత్తుగా కూలిపడింది. ఈ ప్రమాదంలో 21 మంది మృతి చెందగా, 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. భవన శిథిలాల కింద ఇంకా సుమారు 100 మంది వరకు చిక్కుకుపోయినట్లు భావిస్తున్నారు. శిథిలాల నుంచి బాధితుల కేకలు వినిపిస్తున్నప్పటికీ, తగిన యంత్రాలు లేకపోవడంతో బాధితులు, సహాయక సిబ్బంది తమ చేతులతోనే రాళ్లను తొలగిస్తూ రక్షణ చర్యలు చేపడుతున్నారు. గాజాలో సరైన వసతి, గుడారాలు లభించక దాదాపు 2,000 ప్రమాదకరమైన భవనాల్లో నిర్వాసిత కుటుంబాలు నివాసముంటున్నాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది.

మక్కా రక్షణపై రాజీ పడేది లేదు: సౌదీ అరేబియా

ఇస్లాం పవిత్ర స్థలమైన మక్కాలోని నిషేధిత గగనతలంలోకి ప్రవేశించకముందే ఒక డ్రోన్‌ను శత్రుదళాలు ప్రయోగించగా, దాన్ని కూల్చివేసినట్లు సౌదీ నేతృత్వంలోని కూటమి వెల్లడించింది. మక్కాలోని పవిత్ర మసీదులు, యాత్రికుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్య అంశమని, దీనిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని సౌదీ సైనిక ప్రతినిధి తుర్కీ అల్-మాల్కీ హెచ్చరించారు. ఈ దాడి యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారుల పనేనని సౌదీ ఆరోపించగా, హూతీలు ఆ వార్తలను తీవ్రంగా ఖండించారు.

సిరియాలో ఇంధన ధరల మంట.. స్తంభించిన చమురు ట్యాంకర్లు

యూఎస్-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా మందగించడంతో సిరియా ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను 30 శాతానికి పైగా పెంచింది. ఇంధన ధరల పెంపును నిరసిస్తూ ఈశాన్య సిరియాలోని తల్ తమర్ ప్రాంతంలో ప్రజలు భారీ ఎత్తున రహదారి దిగ్బంధనం చేపట్టారు. దీంతో వందలాది చమురు ట్యాంకర్లు రహదారులపైనే నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధి గుండా చమురు రవాణా తగ్గడం, సౌదీలోని చమురు పైప్‌లైన్‌పై దాడులు జరగడం వల్ల రానున్న రోజుల్లో ప్రపంచ చమురు మార్కెట్‌లో మరింత అస్థిరత ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి.




# వరుణ్ చక్రవర్తి స్థానంలో విప్రజ్ నిగమ్

## ఆసియా క్రీడల భారత జట్టులో యువ లెగ్‌స్పిన్ ఆల్‌రౌండర్‌కు చోటు

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడల భారత క్రికెట్ జట్టులో మార్పు చోటుచేసుకుంది. గాయం కారణంగా స్టార్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఆసియా క్రీడలకు దూరం కావడంతో అతని స్థానంలో యువ లెగ్‌స్పిన్ ఆల్‌రౌండర్ విప్రజ్ నిగమ్‌ను ఎంపిక చేశారు. జపాన్‌లోని ఐచి-నగోయాలో ఈ నెల 19 నుంచి ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి.

అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ అనంతరం వరుణ్ పక్కటెముకల పక్క భాగంలో అసౌకర్యానికి గురయ్యాడు. దీంతో అతడిని సిరీస్ నుంచి తప్పించి తదుపరి వైద్య పరీక్షల కోసం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు పంపారు. గాయం నుంచి అతడు ఎప్పుడు కోలుకుంటాడనే దానిపై స్పష్టత లేకపోవడంతో ఆసియా క్రీడల జట్టు నుంచి కూడా తప్పించారు.

వరుణ్ స్థానానికి విప్రజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ పేర్లను పరిశీలించినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అయితే ఈ నెలాఖరులో వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో కుల్దీప్ ఆడనున్న నేపథ్యంలో విప్రజ్‌ను ఆసియా క్రీడల జట్టులోకి తీసుకున్నారు.

ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న 21 ఏళ్ల విప్రజ్ నిగమ్ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 19 మ్యాచ్‌లు ఆడి 13 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లోనూ దూకుడుగా ఆడే అతడు ఐపీఎల్‌లో సుమారు 176 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు సాధించాడు.

ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న ప్రారంభం కానున్నాయి. భారత్ నేరుగా క్వార్టర్‌ఫైనల్ దశలో బరిలోకి దిగనుంది. 35 ఏళ్ల వరుణ్ చక్రవర్తి ఇటీవల తొడ కండరాల గాయం నుంచి కోలుకుని అఫ్గానిస్థాన్ సిరీస్‌తో జాతీయ జట్టులోకి పునరాగమనం చేసిన నేపథ్యంలో తాజా గాయం భారత్‌కు ఎదురుదెబ్బగా మారింది.

# రోహిత్ రికార్డు బద్దలు కొట్టిన బట్లర్

## టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా ఇంగ్లండ్ స్టార్

బలగం టీవీ, హైదరాబాద్




టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా ఇంగ్లండ్ స్టార్ జోస్ బట్లర్ రికార్డు సృష్టించాడు. శ్రీలంకతో సౌతాంప్టన్‌లో జరిగిన తొలి టీ20లో 44 బంతుల్లో 80 పరుగులు చేసిన బట్లర్.. టీ20ల్లో 4,231 పరుగులతో ఉన్న భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను అధిగమించాడు.

బట్లర్ 161 మ్యాచ్‌ల్లో 4,292 పరుగులు సాధించాడు. ఇందులో రెండు శతకాలు, 29 అర్ధశతకాలు ఉన్నాయి. అతని బ్యాటింగ్ సగటు 34.33గా ఉంది. శ్రీలంకపై మ్యాచ్‌లో కెప్టెన్ హ్యారీ బ్రూక్‌తో కలిసి రెండో వికెట్‌కు బట్లర్ 128 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. బ్రూక్ 49 బంతుల్లో 114 పరుగులతో శతకం బాదాడు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 119 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

టీ20ల్లో అత్యధిక పరుగుల జాబితాలో పాకిస్థాన్ స్టార్ బాబర్ ఆజమ్ 4,596 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతని సగటు 38.94గా ఉంది.

# బుమ్రా వరల్డ్ రికార్డు

## భారత్‌లో మూడు ఫార్మాట్లలో 50కిపైగా వికెట్లు తీసిన తొలి బౌలర్

బలగం టీవీ, హైదరాబాద్




టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. భారత్ గడ్డపై మూడు ఫార్మాట్లలోనూ 50కిపైగా అంతర్జాతీయ వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. అఫ్గానిస్థాన్‌తో మంగళవారం ఢిల్లీలో జరిగిన రెండో టీ20లో మహ్మద్ నబీని ఔట్ చేయడం ద్వారా బుమ్రా ఈ అరుదైన ఘనత సాధించాడు.

తొలి టీ20తో అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనం చేసిన బుమ్రా.. రెండో మ్యాచ్‌లోనూ ఒక వికెట్ పడగొట్టాడు. నబీ వికెట్‌తో భారత్‌లో అంతర్జాతీయ టీ20ల్లో 50 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. 45 టీ20ల్లో బుమ్రా ఈ ఘనత సాధించాడు. దీంతో భారత్‌లో టెస్టులు, వన్డేలు, టీ20లు.. మూడు ఫార్మాట్లలోనూ కనీసం 50 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచాడు.

భారత్‌లో బుమ్రా 16 టెస్టుల్లో 62 వికెట్లు, 41 వన్డేల్లో 64 వికెట్లు, 45 టీ20ల్లో 50 వికెట్లు సాధించాడు. టీ20ల్లో భారత్ గడ్డపై 50 వికెట్లు తీసిన భారత బౌలర్లలో బుమ్రా మూడో వాడిగా నిలిచాడు. ఈ జాబితాలో అక్షర్ పటేల్ 57 వికెట్లతో, అర్ష్‌దీప్ సింగ్ 55 వికెట్లతో ముందున్నారు. అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 53 వికెట్లతో మూడో స్థానంలో ఉండగా.. బుమ్రా 50 వికెట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు.

2016లో టీ20ల్లో అరంగేట్రం చేసిన బుమ్రా ఇప్పటివరకు 97 మ్యాచ్‌ల్లో 123 వికెట్లు పడగొట్టాడు. అఫ్గానిస్థాన్‌తో రెండో టీ20లో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది. ఇరు జట్ల మధ్య మూడో టీ20 ఈ నెల 17న జరగనుంది.



# సబలెంకకు భారీ షాక్

## రాకెట్ ముక్కలు చేసినందుకు రూ. 7 లక్షల జరిమానా!

## యూఎస్ ఓపెన్ ఫైనల్లో ఓటమితో అగ్రస్థానం గుల్ల.. రిబకినా నంబర్-1 కోర్టులో కోపం బయటపెట్టడం మేలే చేసిందంటూ బెలారస్ స్టార్ సమర్థన

బలగం టీవీ, హైదరాబాద్

యూఎస్ ఓపెన్ 2026 మహిళల సింగిల్స్ ఫైనల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన బెలారస్ టెన్నిస్ స్టార్ అరియానా సబలెంకకు మరో ఎదురుదెబ్బ తగిలింది. రన్నరప్‌గా నిలిచిన నిరాశతో కోర్టులోనే రాకెట్‌ను బలంగా నేలకేసి కొట్టి విరగ్గొట్టినందుకు గానూ యూఎస్ టెన్నిస్ అసోసియేషన్ ఆమెపై 7,500 అమెరికన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ. 7 లక్షలకు పైగా) భారీ జరిమానా విధించింది.

కోర్టులో పట్టరాని ఆగ్రహం: సెప్టెంబర్ 12న ఆర్థర్ ఆషే స్టేడియంలో కజకిస్థాన్ స్టార్ ఎలెనా రిబకినాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సబలెంక తీవ్ర అసహనానికి గురైంది.

తొలి సెట్: మొదటి సెట్ ఓడిపోయిన వెంటనే బంతిని తీవ్ర ఆగ్రహంతో ప్రేక్షకుల వైపు కొట్టింది.

కెమెరామెన్‌కు తప్పిన ప్రమాదం: మ్యాచ్ ముగిసిన వెంటనే ఆమె కొట్టిన బంతి వేగంగా కెమెరామెన్ వైపు దూసుకెళ్లగా, త్రుటిలో అతడికి ప్రమాదం తప్పింది.

రాకెట్ ముక్కలు: బెంచ్‌పై కూర్చున్న సబలెంక పట్టరాని కోపంతో తన చేతిలో ఉన్న రాకెట్‌ను పలుమార్లు నేలకేసి కొట్టి విరగ్గొట్టింది. ఈ ప్రవర్తనను తీవ్రంగా పరిగణించిన అసోసియేషన్ నిబంధనల ఉల్లంఘన కింద ఆమెకు ఫైన్ విధించింది.

కోర్టులో తన ప్రవర్తనను సబలెంక సమర్థించుకోవడం గమనార్హం. "ఆ నిరాశలో కోపాన్ని బయటకు పంపడమే మంచిదైంది. లేదంటే నా అసహనం మరింత తీవ్రంగా బయటపడేది" అని ప్రజెంటేషన్ అనంతరం పేర్కొంది.

గ్రాండ్ స్లామ్ టైటిల్ తో పాటు నంబర్-1 ర్యాంక్ గల్లంతు: వరుసగా మూడోసారి యూఎస్ ఓపెన్ గెలిచి హ్యాట్రిక్ కొట్టాలనుకున్న సబలెంక ఆశలపై రిబకినా నీళ్లు చల్లింది. రెండున్నర గంటల పాటు సాగిన పోరులో రిబకినా 6-4, 5-7, 6-2 తేడాతో సబలెంకను చిత్తు చేసి తన కెరీర్‌లో తొలి యూఎస్ ఓపెన్ (మొత్తంగా 3వ గ్రాండ్ స్లామ్) ట్రోఫీని ముద్దాడింది.

ఈ ఓటమితో గత 99 వారాలుగా ప్రపంచ నంబర్-1 ర్యాంక్‌లో ఉన్న సబలెంక (7,875 పాయింట్లు) రెండో స్థానానికి పడిపోయింది. చాంపియన్‌గా నిలిచిన ఎలెనా రిబకినా 9,901 పాయింట్లతో తొలిసారి ప్రపంచ నంబర్-1 ర్యాంక్‌ను కైవసం చేసుకుంది.

# జనవరి 14 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్

## అక్టోబర్ 28న కొచ్చిలో ఆటగాళ్ల వేలం.. బీసీసీఐ అధికారిక ప్రకటన

బలగం టీవీ, హైదరాబాద్

క్రికెట్ ప్రేమికులకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీపి కబురు అందించింది. అత్యంత ఆదరణ పొందిన విమెన్స్ ప్రిమియర్ లీగ్ (WPL) ఐదో సీజన్ నిర్వహణ తేదీలను బుధవారం అధికారికంగా ప్రకటించింది. 2027 జనవరి 14వ తేదీన ప్రారంభమయ్యే ఈ పొట్టి ఫార్మాట్ టోర్నీ, ఫిబ్రవరి 7వ తేదీ వరకు జరగనుంది.

**కొచ్చిలో నిర్వహించనున్న వేలం ప్రక్రియ**

ఈ టోర్నీకి సంబంధించి కీలకమైన ఆటగాళ్ల వేలం ప్రక్రియను ఈ ఏడాది అక్టోబర్ 28న కేరళలోని కొచ్చి నగరం వేదికగా నిర్వహించనున్నట్లు బోర్డు తెలిపింది. లీగ్‌లో పాల్గొనే ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లను బలోపేతం చేసుకునేందుకు ఈ వేలం వేదిక కానుంది. ఈ మేరకు జట్లలో ఆటగాళ్లను నిలుపుకునేందుకు (రిటెన్షన్) సెప్టెంబర్ 28వ తేదీని ఆఖరి గడువుగా నిర్ణయించినట్లు స్పష్టం చేసింది. తమ పాత జట్ల నుంచి అవసరమైన క్రీడాకారిణులను రీటైన్ చేసుకునే వెసులుబాటును ఫ్రాంచైజీలకు కల్పించింది.

**వేదికల వివరాలు త్వరలో వెల్లడి**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ క్రీడాకారిణులతో పాటు భారత్‌కు చెందిన యువ ప్రతిభావంతులకు ఈ లీగ్ అద్భుతమైన వేదికగా నిలుస్తోందని బీసీసీఐ ప్రకటనలో పేర్కొంది. కాగా, ఈ ఐదో సీజన్ మ్యాచులు ఏ ఏ నగరాల్లో జరగనున్నాయనే వేదికల వివరాలను బోర్డు ప్రస్తుతం వెల్లడించలేదు. అతిత్వరలోనే టోర్నీ నిర్వహించే నగరాల జాబితాను విడుదల చేయనున్నారు.




# టీమిండియాకు యువరాజ్ సింగ్ కీలక సలహా

## 'నిరంతరం ఆటగాళ్లను మార్చవద్దు.. 20 మందితో కోర్ టీమ్‌ను సిద్ధం చేయండి'

## హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, టీమ్ మేనేజ్‌మెంట్‌కు యువీ సూచన

## 2027 ప్రపంచకప్ నెగ్గాలంటే అదే ఏకైక మార్గం!

బలగం టీవీ, హైదరాబాద్

2027 వన్డే ప్రపంచకప్‌ను టీమిండియా ముద్దాడాలంటే జట్టులో తరచూ మార్పులు చేసే విధానానికి స్వస్తి పలకాలని భారత మాజీ ఆల్‌రౌండర్, ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్ సూచించాడు. టోర్నీ సమయానికి కనీసం 16 నుంచి 20 మంది ఆటగాళ్లతో కూడిన ఒక బలమైన 'కోర్ టీమ్'ను (Core Team) ముందే సిద్ధం చేసుకుని, వారిపైనే పూర్తి నమ్మకం ఉంచాలని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మరియు మేనేజ్‌మెంట్‌కు సలహా ఇచ్చాడు. ఓ ప్రముఖ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యువీ ఈ వ్యాఖ్యలు చేశాడు.

ఆఖరి నిమిషం మార్పులే కొంపముంచుతున్నాయి: భారత జట్టు గతాన్ని గుర్తుచేస్తూ యువరాజ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. "గతంలో మెగా టోర్నీల్లో భారత్ విఫలమైన ప్రతిసారీ, దానికి ప్రధాన కారణం ఆఖరి నిమిషంలో చేసిన భారీ మార్పులే. 2027 ప్రపంచకప్ గెలవగలదని నమ్మకం ఉన్న ఆటగాళ్లను ఎంపిక చేసి, టోర్నీ వరకు వారి వెంటే నిలబడటం చాలా ముఖ్యం. ఆటగాళ్లు రాణించినా, విఫలమైనా వారిపై యాజమాన్యం నమ్మకం ఉంచాలి" అని స్పష్టం చేశాడు.



వన్డేలు తగ్గడం వల్ల ప్రాక్టీస్ లోటు: ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో టీ20 ఫార్మాట్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటంతో వన్డే మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోయిందని యువీ గుర్తుచేశాడు. "వన్డేలు తక్కువగా ఆడటం వల్ల ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించడం లేదు. కాబట్టి ఒక నిర్దిష్ట జట్టును ఎంచుకొని వారికే నిలకడగా అవకాశాలు ఇవ్వాలి. పిచ్, మైదానం పరిస్థితులకు అనుగుణంగా తుది జట్టులో ఒకటి రెండు మార్పులు చేస్తే సరిపోతుంది" అని అభిప్రాయపడ్డాడు.

ఆస్ట్రేలియా శైలిని అలవర్చుకోవాలి: ఆస్ట్రేలియా జట్టు సాధించిన ప్రపంచకప్ విజయాలను యువీ ఉదాహరణగా ప్రస్తావించాడు. "ఆస్ట్రేలియా టోర్నీలు గెలవడానికి కారణం వారి జట్టులో మ్యాచ్ విన్నర్లు ఉండటమే. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఉన్న ఆటగాళ్లను గుర్తించి భారత్ ప్రోత్సహించాలి. ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కూడా ఇదే స్థిరమైన వ్యూహంతో విజయం సాధించింది. 2027 వన్డే వరల్డ్ కప్ కోసం కూడా గంభీర్ సేన ఇదే దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలి" అని యువరాజ్ ముగించాడు.

# భారత్‌లోనే ఐపీఎల్ 2027 వేలం




## స్వదేశంలోనే నిర్వహించేందుకు బీసీసీఐ సుముఖత

## ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడి

బలగం టీవీ, హైదరాబాద్

ఇండియన్ ప్రిమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్‌కు సంబంధించిన ఆటగాళ్ల వేలం వేదికపై కీలక సమాచారం వెలువడింది. గత మూడేళ్లుగా విదేశాల్లో నిర్వహిస్తున్న ఈ ఆటగాళ్ల వేలం ప్రక్రియను ఈసారి తిరిగి భారత్‌లోనే నిర్వహించేందుకు బీసీసీఐ ప్రయత్నాలు చేస్తోందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ తెలిపారు. వేలం నిర్వహణకు అనువైన వేదిక లభ్యతను బట్టి ఏ నగరంలో జరపాలనేది బోర్డు నిర్ణయించనుంది.

మూడేళ్ల తర్వాత స్వదేశానికి వేలం వేదిక

గత మూడు సీజన్లకు సంబంధించిన వేలం ప్రక్రియలు దుబాయ్, జెద్దా (మెగా వేలం), అబుదాబి వేదికలుగా విదేశాల్లో జరిగిన సంగతి తెలిసిందే. ప్రతి ఏటా భారత్‌లోనే నిర్వహించాలని భావించినప్పటికీ, వివాహాల సీజన్ కారణంగా సరైన వేదికలు అందుబాటులో లేకపోవడంతో విదేశాలకు తరలించాల్సి వచ్చిందని ధుమాల్ వివరించారు. ఈసారి చిన్నపాటి వేలం (మినీ ఆక్షన్) కావడం వల్ల దేశీయంగానే వేదిక లభించే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 18న జరిగే బీసీసీఐ వార్షిక సాధారణ సమావేశంలో (ఏజీఎమ్) ఐపీఎల్ ఛైర్మన్‌గా అరుణ్ ధుమాల్, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఖైరుల్ మజుందార్ తిరిగి ఎన్నిక కానున్నారు.

'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై పునరాలోచన

ఇటీవల జరిగిన గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో వివాదాస్పదంగా మారిన 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై బీసీసీఐ సుదీర్ఘంగా చర్చించింది. ఈ నిబంధన ఆల్ రౌండర్ల పాత్రను తీవ్రంగా దెబ్బతీస్తోందని భారత వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ ఆల్ రౌండర్లు హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ సహా పలువురు కెప్టెన్లు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. క్రీడాకారులు, ఫ్రాంచైజీలు, ఇతర భాగస్వాముల నుంచి సేకరించే అభిప్రాయాల ఆధారంగా ఈ నిబంధనను సమీక్షించి తగిన నిర్ణయం తీసుకుంటామని ధుమాల్ స్పష్టం చేశారు.

# 2027 ఫార్ములా-1 సీజన్‌కు బహ్రెయిన్‌లోనే శ్రీకారం

## మార్చి 14న తొలి రేసు.. 24 రేసులతో షెడ్యూల్ విడుదల

## 10 స్ప్రింట్ రేసులు.. తొలిసారి మొనాకోలోనూ స్ప్రింట్

## జూన్‌లో పోర్చుగల్‌కు తిరిగిరానున్న ఫార్ములా-1

బలగం టీవీ, హైదరాబాద్



మధ్యప్రాచ్యంలో భద్రతాపరమైన అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ 2027 ఫార్ములా-1 సీజన్‌ను బహ్రెయిన్ గ్రాండ్‌ప్రితో ప్రారంభించేందుకు నిర్వాహకులు షెడ్యూల్ ఖరారు చేశారు. బుధవారం విడుదల చేసిన 24 రేసుల షెడ్యూల్ ప్రకారం మార్చి 14న బహ్రెయిన్‌లో తొలి రేసు జరగనుంది. ఆ తర్వాత వారం మార్చి 21న సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి నిర్వహించనున్నారు.

సీజన్ చివర్లో ఖతార్, అబుదాబి రేసులు కూడా షెడ్యూల్‌లో ఉన్నాయి. ఖతార్ గ్రాండ్‌ప్రి నవంబర్ 29న, సీజన్ ముగింపు అబుదాబి గ్రాండ్‌ప్రి డిసెంబర్ 6న జరగనున్నాయి. ఈ రేసులకు దీర్ఘకాలిక ఆతిథ్య ఒప్పందాలు ఉన్నాయి. బహ్రెయిన్‌లో ఫిబ్రవరిలో సీజన్‌కు ముందు పరీక్షలు కూడా నిర్వహించనున్నారు.

ఈ ఏడాది ఇరాన్ యుద్ధం కారణంగా బహ్రెయిన్, సౌదీ అరేబియా రేసులు రద్దయ్యాయి. వాటి స్థానంలో వచ్చే నెల మలేషియాలో అదనపు రేసును నిర్వహించనున్నారు. దీనికి బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి పేరును ఉపయోగించనున్నారు.

రంజాన్ కారణంగా గతంలో మార్పు

ఇటీవలి సంవత్సరాల్లో బహ్రెయిన్ సీజన్ ప్రారంభ రేసుకు ఆతిథ్యమిచ్చింది. అయితే ముస్లింల పవిత్ర మాసం రంజాన్‌తో తేదీలు ఢీకొనడంతో 2025, 2026లో ప్రారంభ రేసు స్థానాన్ని మార్చారు. 2027 షెడ్యూల్‌లో మాత్రం మార్చి 14న బహ్రెయిన్‌లోనే సీజన్ ప్రారంభం కానుంది.

వచ్చే ఏడాది మే 30న జరిగే ఇండియానాపోలిస్ 500, జూన్ 12-13 తేదీల్లో జరిగే లీ మాన్స్ 24 గంటల రేసుతో ఫార్ములా-1 రేసులు ఢీకొనకుండా షెడ్యూల్ రూపొందించారు. ఈ ఏడాది మాత్రం ఈ రెండు ప్రతిష్ఠాత్మక రేసులతో ఒకే తేదీల్లో ఫార్ములా-1 రేసులు జరిగాయి. నాలుగుసార్లు ఫార్ములా-1 ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ భవిష్యత్‌లో లీ మాన్స్‌లో పోటీ చేయాలనే ఆసక్తి వ్యక్తం చేశాడు.

10 స్ప్రింట్ రేసులు

2027లో స్ప్రింట్ రేసుల సంఖ్యను ఆరు నుంచి 10కి పెంచనున్నారు. తొలిసారి మొనాకో గ్రాండ్‌ప్రిలోనూ స్ప్రింట్ రేసు నిర్వహించనున్నారు. అక్కడ అధిగమించడం అత్యంత కష్టమైనప్పటికీ స్ప్రింట్ పోటీని ప్రవేశపెట్టనున్నారు.

సీజన్ ప్రారంభమైన బహ్రెయిన్ వారాంతంలోనూ స్ప్రింట్ రేసు ఉంటుంది. దీంతో ఒక ఫార్ములా-1 సీజన్ తొలి గ్రాండ్‌ప్రికి ముందు స్ప్రింట్ రేసుతో ప్రారంభం కావడం ఇదే తొలిసారి కానుంది.

స్ప్రింట్ రేసులు ఉన్న వారాంతాల్లో సగటు ప్రేక్షక వీక్షణ 12 శాతం అధికంగా ఉందని ఫార్ములా-1 తెలిపింది. స్ప్రింట్ రేసుల సంఖ్య పెంపుతో అభిమానులకు మరింత ఉత్కంఠ, నాటకీయత, వాహనాల మధ్య పోటీని అందించనున్నట్లు ఫార్ములా-1 ముఖ్య కార్యనిర్వహణాధికారి స్టెఫానో డొమెనికాలి తెలిపారు.

# పోగొట్టుకున్న ఆసియా గేమ్స్ పతకంపైనే బాక్సర్ పర్వీన్ హుడా కన్ను!

## సస్పెన్షన్, గాయాలను అధిగమించి మళ్లీ రింగ్‌లోకి దిగుతున్న భారత పంచర్

బలగం టీవీ, హైదరాబాద్



చేతికి అందివచ్చిన పతకాన్ని కోల్పోయిన వేదనను దిగమింగి, సరికొత్త పట్టుదలతో ఆసియా క్రీడల్లోకి అడుగుపెడుతోంది భారత స్టార్ బాక్సర్ పర్వీన్ హుడా. 2023 హ్యాంగ్‌జౌ ఆసియన్ గేమ్స్‌లో 57 కేజీల విభాగంలో గెలుచుకున్న కాంస్య పతకం, ఒలింపిక్ కోటాలు సస్పెన్షన్ కారణంగా చేజారిన సంగతి తెలిసిందే. అయితే ఆ చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ, వచ్చే ఆసియా గేమ్స్‌లో సరికొత్త పతకంతో రింగ్‌లో తన సత్తా చాటాలని ఈ 26 ఏళ్ల హర్యానా బాక్సర్ తీవ్రంగా శ్రమిస్తోంది.

వరుస సవాళ్లు.. మారుతున్న బరువు విభాగాలు

వేర్‌అబౌట్స్ (అందుబాటులో లేకపోవడం) నిబంధనల ఉల్లంఘన కారణంగా వాడా (WADA) విధించిన 22 నెలల నిషేధం పర్వీన్ కెరీర్‌ను తీవ్రంగా దెబ్బతీసింది. నిషేధం పూర్తి చేసుకుని తిరిగొచ్చేసరికి ఆమె పాత 57 కేజీల విభాగంలో జైస్మిన్ లాంబోరియా ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడంతో, పర్వీన్ 60 కేజీల విభాగానికి మారాల్సి వచ్చింది. వరల్డ్ కప్ ఫైనల్స్‌లో 60 కేజీల విభాగంలో స్వర్ణం సాధించి పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నప్పటికీ, ఆ తర్వాత గాయం కావడం, ప్రియా ఘంగాస్ రాణించడంతో కామన్వెల్త్ గేమ్స్ కోసం మరోసారి బరువు పెరిగి 65 కేజీల విభాగానికి మారాల్సి వచ్చింది.

జపాన్ ఆసియాడ్ కోసం ప్రత్యేక శిక్షణ

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో 65 కేజీల విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌లోనే నిష్క్రమించినప్పటికీ, ఆ అనుభవం నుంచి ఎంతో నేర్చుకున్నానని పర్వీన్ తెలిపింది. కొత్త బరువు విభాగానికి అలవాటు పడటానికి, బలాన్ని పెంచుకోవడానికి కఠిన సాధన చేస్తున్నట్లు వెల్లడించింది. ఆసియా క్రీడల్లో పోటీ తీవ్రంగా ఉంటుందని, ముఖ్యంగా తన షార్ట్, మీడియం రేంజ్ పంచ్‌లను మెరుగుపరుచుకోవడంపై కోచ్‌ల పర్యవేక్షణలో దృష్టి సారించినట్లు పేర్కొంది. పాత కాంస్యాన్ని కోల్పోయిన చోటే కొత్త పతకాన్ని ముద్దాడి తన లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలని పర్వీన్ పట్టుదలతో ఉంది.

# CINEMA

## ‘ది ప్యారడైజ్’కు సెన్సార్ పూర్తి..




నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ది ప్యారడైజ్’ సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా మొత్తం 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురించి నాని మాట్లాడుతూ, తన 18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంతగా శ్రమించిన సినిమా మరొకటి లేదని అన్నారు. “శారీరకంగా, మానసికంగా ‘ది ప్యారడైజ్’ నన్ను బాగా అలసిపోయేలా చేసింది. ఇంత కష్టపడి నేను మరో సినిమాకు పనిచేయలేదు” అని ఇటీవల మీడియా సమావేశంలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. “సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు ఉన్నాయని, వెయ్యి మందితో ఫైట్ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. వాటిలో నిజం లేదు. ఇది ఒక వాస్తవిక కథ. యాక్షన్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. హింసలో కూడా ఓ భావోద్వేగం ప్రేక్షకులకు కనపడుతుంది” అని వివరించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ, “సినిమా కాస్త ఆలస్యమైనా, విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది ఒక విప్లవాత్మక, భావోద్వేగభరితమైన చిత్రం. తల్లీకొడుకుల కథతో పాటు, అణచివేతకు గురైన ఒక సమాజం కథ ఇది” అని అన్నారు. కాళోజీ మాటలను గుర్తుచేస్తూ, ““పుట్టుక మనది, చావు మనది, కానీ మన బతుకంతా దేశానిది’ అనే వాక్యం ఈ కథకు స్ఫూర్తి. దేశం కోసం పోరాడిన ప్రజలకు, అదే దేశంలో చోటు లేనప్పుడు ఏం చేయాలో తెలియక తిరగబడటమే ‘ది ప్యారడైజ్’ కథ” అని తెలిపారు. అభిమానుల్లో భారీ అంచనాలను రేకెత్తిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న విడుదల కానుంది.

## వేగం పెంచిన ‘ధర్మన్’




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం ‘ధర్మన్’ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. “ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను” అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్.. రజనీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ఫ్యాకల్టీగా జూనియర్ డాక్టర్లకు పాఠాలు చెబుతున్న సన్నివేశాలతో కూడిన వీడియోను విడుదల చేసింది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. కమల్ నిర్మాణంలో రజనీ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘ధర్మమే వెల్లుమ్’ (ధర్మమే గెలుస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో కమల్ హాసన్ స్వయంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక వైద్యుడి పాత్రలో నటిస్తూనే, సమాజంలోని నేరస్థులను శిక్షించే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో విడుదలైన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ చేతిలో పట్టుకుని, ఒక రౌడీ మృతదేహంపై కాలు వేసి ఉన్న రజనీకాంత్ లుక్ సినిమాపై ఉత్కంఠను మరింత పెంచింది. ఈ చిత్రానికి యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలైన అన్బరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వరుస షెడ్యూళ్లతో సినిమాను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్రణాళికలు రచిస్తోంది.

# అనంత్ నాగ్‌కు ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం



ఈ నెల 22న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రధానం ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను సినీ రంగంలో అత్యున్నత ప్రతిష్టాత్మక పురస్కారం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 2024 సంవత్సరానికి ఆయనకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారతీయ సినిమాకు అనంత్ నాగ్ అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు కేంద్రం తెలిపింది. గుజరాత్‌లోని కేవడియాలో ఈ నెల 22న జరగనున్న 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో అనంత్ నాగ్‌కు... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారం అందజేయనున్నారు. కన్నడతో పాటు పలు భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు అనంత్ నాగ్. ఆయనకు అత్యున్నత పురస్కారం దక్కడం పట్ల కన్నడ ఇండస్ట్రీతో పాటు సినీ అభిమానులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ‘ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో సత్కరించబడిన ప్రఖ్యాత నటుడు అనంత్ నాగ్ గారికి అభినందనలు. గత కొన్ని దశాబ్దాలుగా, ఆయన సహజ నటన, అద్భుతమైన బహుముఖ ప్రజ్ఞ, అసాధారణమైన కళా నైపుణ్యం భారతీయ సినిమాపై, ముఖ్యంగా కన్నడ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేశాయి. ఆయన పోషించిన ప్రతి పాత్రలోనూ సాటిలేని నటనను, జీవాన్ని నింపారు. ఒక గొప్ప కళాకారుడికి ఇది నిజంగా దక్కిన అర్హమైన గౌరవం.’ అంటూ పోస్ట్ చేశారు. దాదాపు 5 దశాబ్దాల సినీ ప్రయాణంలో అనంత్ నాగ్... కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠీ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు. తన నటనతో ఎంతో మంది ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన... 1973లో కన్నడ మూవీ ‘సంకల్ప’తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత మంథన్, కొండుర, కల్‌యుగ్ తదితర చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి.ఆర్కే నారాయణన్ కథల ఆధారంగా తెరకెక్కించిన ఫేమస్ టీవీ సీరియల్ ‘మాల్గుడి డేస్’లో అనంత్ నాగ్ మిఠాయి వాలా పాత్రతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. అలాగే, రాజ కుమార, గాలిపట 2, కేజీఎఫ్, కన్నేశ్వర రామ వంటి మూవీస్ మరింత పేరు తీసుకొచ్చాయి. తెలుగులో భీష్మ, బాలు, అనుగ్రహం,



శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2025లో ‘పద్మ భూషణ్’తో గౌరవించింది. ఇప్పుడు అత్యున్నత దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందించనుంది.

# ఓటీటీలోనూ సత్తా చాటుతోన్న విశ్వనాథ్ అండ్ సన్స్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మమితా బైజు జంటగా నటించిన సినిమా ‘విశ్వనాథ్ అండ్ సన్స్’. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ ఫ్యామిలీ డ్రామా థియేటర్లలో భారీ విజయం సాధించింది. అనంతరం సెప్టెంబర్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీ థియేటర్ రన్‌లోనే కాదు.. ఓటీటీలోనూ తన సత్తా చాటుతోంది. ఈ క్రమంలో ముఖ్యంగా దళపతి విజయ్, ప్రభాస్ సినిమాల వ్యూస్‌ను అధిగమిస్తూ సూర్య మూవీ సరికొత్త రికార్డు సృష్టించింది. ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ తొలి వారంలోనే రికార్డు స్థాయి వ్యూస్ సొంతం చేసుకుంది. నెట్‌ఫ్లిక్స్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ఈ సినిమా తొలి వారం (సెప్టెంబర్ 7 నుంచి 13 వరకు)లోనే 5.5 మిలియన్ వ్యూస్ సాధించింది. మొత్తం 14.6 మిలియన్ వ్యూయింగ్ అవర్స్ నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్ నాన్-ఇంగ్లిష్ మూవీస్ ట్రెండింగ్ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఈ రికార్డు బట్టి చూస్తే ఈ సినిమాకు ఇండియాలోనే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రస్తుతం ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులో ఉంది. 5.5 మిలియన్ వ్యూస్‌తో ‘విశ్వనాథ్ అండ్ సన్స్’.. 2026లో థియేటర్ల తర్వాత ఓటీటీలోకి వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో టాప్ లో నిలిచింది. అంతకుముందు విజయ్ మూవీ బ్లాస్ 4.4 మిలియన్ వ్యూస్‌తో టాప్ ఉండగా.. సూర్య సినిమా ఆ రికార్డును బ్రేక్ చేసింది. కరా 3.8 మిలియన్, జననాయగన్ 3.6 మిలియన్, ప్రభాస్ ‘రాజాసాబ్ 3.4 మిలియన్ వ్యూస్‌తో తదుపరి స్థానాల్లో నిలిచాయి. అంటే సూర్య సినిమా థియేటర్లలో సాధించిన విజయాన్ని ఓటీటీ రిలీజ్ తర్వాత






కూడా కొనసాగించిందని చెప్పొచ్చు. ఇదే సమయంలో మరో రికార్డు నమోదైంది. నెట్‌ఫ్లిక్స్‌లో థియేట్రికల్ రిలీజ్ తర్వాత స్ట్రీమింగ్‌కు వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఆల్‌టైమ్ ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ 5.5 మిలియన్ వ్యూస్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో అల్లు అర్జున్ పుష్ప 2 5.8 మిలియన్ వ్యూస్‌తో మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాత ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ 5.5 మిలియన్‌తో నిలిచింది. ఇడ్లీ కాడాయి 5.2 మిలియన్, లక్కీ భాస్కర్ 5.1 మిలియన్, బాస్ట్ 4.4 మిలియన్ వ్యూస్‌తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అంటే కేవలం 2026లోనే కాకుండా నెట్‌ఫ్లిక్స్‌లో సౌత్ సినిమాల డిజిటల్ వ్యూస్‌లో కూడా కూడా సూర్య మూవీ టాప్‌లో నిలిచిందన్నమాట. ఇక సూర్య మూవీకి అంతర్జాతీయంగా కూడా మంచి ఆదరణ లభిస్తోంది. 14 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ టాప్ 10లో ఈ సినిమా ట్రెండింగ్ లో ఉంది. బహ్రెయిన్, శ్రీలంక, భారత్, యూఏఈ వంటి దేశాల్లో టాప్ స్థానంలో నిలిచినట్టు నెట్ ఫిక్స్ తెలిపింది. ఇది సూర్య సినిమాకు ఉన్న మార్కెట్‌ను మరోసారి చూపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళం అనే రెండు ప్రధాన మార్కెట్లతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల కావడంతో ఈ సినిమా ఈ రేంజ్‌లో గ్లోబల్ రీచ్ అందుకుందని చెప్పాలి.